**విలేఖరులు కావలెను**

ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారధ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..

స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108.
E-mail: shanthimama@gmail.com



ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా స్ఫూర్తి పబ్లికేషన్స్ వారి


# ధర్మఘంట

TELTEL/2012/47103

తెలుగు జాతీయ దిన పత్రిక

సంపుటి : 12 సంచిక :67 నల్గొండ మంగళవారం 27-05-2025 ఎడిటర్ : మేడే శాంతికుమార్ పేజీలు : 4 వెల : రూ.1/-


## కరోనాతో ఇద్దరు మృతి..! పెరుగుతున్న కేసులు..



న్యూఢిల్లీ,దేశంలో పెరుగుతున్న కరోనా కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి.. అంతేకాకుండా కొత్త రూపంలో పంజా విసురుతోంది.. NB 1.8.1, LF.7.. ఈ రెండు కొత్త వేరియంట్లలో కరోనా ప్రభావం చూపిస్తున్నట్లు ఇండియన్ జీనోమిక్స్ కన్సార్టియం నిపుణులు గుర్తించారు. అయితే.. కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, ఢిల్లీ, కర్నాటకలో అత్యధికంగా కేసులు నమోదు అవుతున్నాయి. ఇటు తెలుగు రాష్ట్రాల్లోనూ పాజిటివ్ కేసులు నమోదు కావడం ఆందోళన కల్గిస్తోంది.. కేరళలో ఏకంగా 273 కరోనా కేసులు నమోదయినట్లు అధికారులు ప్రకటించారు. తమిళనాడులో 66, మహారాష్ట్రలో 56, ఢిల్లీలో 23.. కర్నాటకలో 36 యాక్టివ్ కేసులున్నాయి. ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్‌లో ఇప్పటికే 4 కేసులు నమోదు కాగా.. నోయిడాలో తొలి కరోనా కేసు నమోదైంది..అయితే.. కరోనాతో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం కలకలం రేపుతోంది. మహారాష్ట్ర థానేలో కొవిడ్‌తో 21 ఏళ్ల యువకుడు ప్రాణాలు కోల్పోయాడు.. బెంగళూరులో కరోనాతో 84 ఏళ్ల వృద్ధుడు మృతి చెందాడు.భారతదేశంలో మే 25, 2025 నాటికి 275 యాక్టివ్ కేసులు ఉన్నట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నివేదించింది. ఈ కేసుల్లో ఎక్కువ భాగం తేలికపాటివి.. ఆందోళన అక్కర్లేదని ఆరోగ్య అధికారులు తెలిపారు. మొత్తం 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో కొవిడ్ కేసులు వెలుగుచూశాయని అధికార వర్గాలు తెలిపాయి. ఇవి ఎక్కువగా పట్టణాల్లోనే నమోదు అవుతున్నట్లు గణాంకాలు చెప్తున్నాయి.. కేరళలో అత్యధికంగా కరోనా కేసులు నమోదవ్వడంతో.. ఆస్పత్రుల్లో మాస్కులు తప్పనిసరి చేసింది ప్రభుత్వం.. మహారాష్ట్రలోనూ కరోనా కేసుల సంఖ్య పెరుగుతోంది. కేవలం ముంబైలోనే ఈ నెలలో 95 కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది.. ఢిల్లీలో కరోనా కేసులు పెరగడంతో ఆస్పత్రులకు పలు సూచనలు జారీ చేశారు.ఇదిలాఉంటే.. తెలుగు రాష్ట్రాలను కరోనా కలవరపెడుతోంది. తెలుగు రాష్ట్రాల్లో పాజిటివ్ కేసుల సంఖ్య 5కు చేరింది.. కూకట్‌పల్లిలో ఓ డాక్టర్‌కు కరోనా సోకింది. బాధితుడు జలుబు, దగ్గు, జ్వరం లక్షణాలతో బాధపడుతున్నాడు. అప్రమత్తమైన తెలంగాణ ప్రభుత్వం.. గాంధీ ఆస్పత్రిలో 25 పడకల వార్డు సిద్ధం చేసింది. ఇక ఏపీ విషయానికి వస్తే విశాఖలో 2 కరోనా కేసులు, కడపలో రెండు కేసులు నమోదయ్యాయి. అలెర్ట్ అయిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు.. విశాఖ జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు.కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ఆరోగ్య శాఖ సూచించింది. అన్ని సౌకర్యాలతో ఆస్పత్రులను సిద్ధం చేసుకోవాల కేంద్ర ఆరోగ్య శాఖ సూచనలు జారీ చేసింది. అయితే.. భయపడాల్సిన పనిలేదని.. ఇవి తేలికపాటి లక్షణాలేనని ఆరోగ్య శాఖ పేర్కొంది.. అయితే.. మాస్కు ధరించడంతోపాటు జాగ్రత్తలు పాటించడం మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.JN.1 వేరియంట్ అన్ని లక్షణాలు మునుపటిలాగే ఉన్నాయని.. దగ్గు, జలుబు, తలనొప్పి, తేలికపాటి జ్వరం లాంటి లక్షణాలు కనిపిస్తాయని వైద్యులు చెబుతున్నారు.

## కవిత లేఖ కలకలం.. కేసీఆర్ పై ఈటల షాకింగ్ కామెంట్స్



హైదరాబాద్,బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాసిన లేఖ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. గులాబీ పార్టీలో ఏం జరుగుతుందో అనే ఉత్కంఠ రోజురోజుకూ పెరిగిపోతోంది.ఈ నేపథ్యంలో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఓ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈటల మాట్లాడుతూ, కేసీఆర్ ఒకరిపై నెగటివ్ అభిప్రాయం పెంచుకుంటే ఇక ఆయనను ఒప్పించటం అసాధ్యమని అన్నారు. కవిత విషయంలోనూ ఇదే జరిగింది అని భావిస్తున్నట్లు తెలిపారు. "కేసీఆర్ తనకు తాను చక్రవర్తిలా భావిస్తారు. ఆయనను ఎవరు ప్రశ్నించకూడదు, విమర్శించకూడదు. ఆయన మాటే శాసనం," అని ఈటల వ్యాఖ్యానించారు.20 ఏళ్ల పాటు కేసీఆర్‌తో పనిచేసిన అనుభవంతో మాట్లాడుతూ, "అయన పక్కన ఉండటం అంటే పూర్తిగా ఆయన్ని అనుసరించాల్సిందే. ఆయన్ను విమర్శించినవారిని ఆయన సహించరు. అతని పాలన రాచరికపు ధోరణిలో సాగుతుంది," అని ఆరోపించారు. కేసీఆర్ నమ్మినవారినే అవసరమైనప్పుడు వాడుకుని తరువాత వదిలేస్తారని, ఇదే ఆయన రాజకీయం కుదించడానికి కారణమైందన్నారు. కవిత విషయంలో కుటుంబంలో ఏదో తేడా వచ్చి ఉండొచ్చని, మళ్లీ కలవడానికి అవకాశం లేదని ఈటల స్పష్టం చేశారు. ఈటల తనను కేసీఆర్ ఎందుకు దూరం చేసుకున్నారన్న అంశంపై మాట్లాడుతూ, "ఎవరో చెప్పిన మాటలపై నమ్మకంతోనే ఆయన నన్ను పక్కన పెట్టారు. ఇదే విధంగా హరీశ్ రావుతోనూ 2016 నుంచే ఇబ్బందులు నడుస్తున్నాయి," అన్నారు.హరీశ్ రావు బీజేపీతో టచ్‌లో ఉన్నారని వస్తున్న ప్రచారాన్ని ఖండిస్తూ,"అయన మాతో టచ్‌లో లేరు" అని స్పష్టం చేశారు.

## బీజేపీ మార్క్ అభివృద్ధి.. వీడియోలతో పరువు తీసిన కేటీఆర్



హైదరాబాద్: బీజేపీ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెటైరికల్ కామెంట్స్ చేశారు. బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని మే నెలలో కురిసిన సాధారణ వర్షపాతం బహిర్గతం చేసిందని ఎద్దేవా చేశారు. భవనం పైకప్పునే సరిగ్గా నిర్మించలేకపోయిన వాళ్లు.. కాళేశ్వరం గురించి మాట్లాడుతున్నారంటూ వీడియోను షేర్ చేశారు.మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ట్విట్టర్ వేదికగా..'బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని బహిర్గతం చేయడానికి సాధారణ వర్షం చాలు.. హైదరాబాద్‌లో 430 కోట్లతో నిర్మించిన చర్లపల్లి రైల్వే స్టేషన్ అయినా ఢిల్లీ విమానాశ్రయం పైకప్పులైనా, బీజేపీ మార్క్ 'అభివృద్ధి'ని చెప్పడానికి సాధారణ వర్షం సరిపోతుంది. బీజేపీ ప్రభుత్వం సరిగ్గా పైకప్పును కూడా నిర్మించలేకపోవడం విచారకరం.. కానీ, బీజేపీ వాళ్లు కాళేశ్వరం గురించి మాట్లాడుతున్నారు. బీజేపీ ప్రవేశపెట్టిన షేప్ షిఫ్టర్ పైకప్పుల అద్భుతమైన సరికొత్త డిజైన్లను ఏ ఏజెన్సీ పరిశీలిస్తుందో చూడాలి మరి?!' అంటూ సెటర్లు వేశారు.ఇక, ఈ వీడియోలో ఇటీవల బీజేపీ ప్రభుత్వం ప్రారంభించిన ఢిల్లీ విమానాశ్రయం, చర్లపల్లి రైల్వే స్టేషన్ కనిపిస్తున్నాయి. బీజేపీ ప్రభుత్వం, ప్రధాని మోదీ వీటిని ఎంతో ఆడంబరంగా ప్రారంభించి.. ప్రచారం చేశారు. ఇవి ప్రారంభమై కొన్ని నెలలే అవుతున్నప్పటికీ చిన్న పాటి వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో, పనితీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## జ్యోతి మల్హోత్రా బ్యాంకు ఖాతాల వివరాల సేకరణ..



న్యూఢిల్లీ,పాకిస్తాన్ తరపున గూఢచర్యం చేసిందనే ఆరోపణలపై అరెస్టయిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా బ్యాంకు ఖాతాల వివరాలను పోలీసులు సేకరించారు. జ్యోతి మల్హోత్రాతో పాటు, ఆమె తండ్రి, మామ బ్యాంకు ఖాతా వివరాలపై ఆరా తీశారు.జ్యోతి పీఎన్‌బీ ఖాతాలో పోలీసులు ఎటువంటి భారీ లావాదేవీలను గుర్తించలేదు. జ్యోతికి ఆదాయానికి మించి డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో, అది ఏ ఖాతాలోకి వచ్చిందో తెలుసుకోవడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు. జ్యోతి పాత పీఎన్‌బీ ఖాతా వివరాలను పోలీసులు పరిశీలించగా, వారికి పెద్దగా ఏమీ దొరకలేదు.జ్యోతి 2011-2012 సంవత్సరంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ శాఖలో తన ఖాతాను తెరిచింది. అప్పటి నుంచి సెప్టెంబర్ 2024 వరకు, ఖాతాలో లావాదేవీలు చాలా తక్కువగా ఉన్నాయి. దాదాపు మూడు సంవత్సరాల లావాదేవీలను పోలీసులు దర్యాప్తు చేశారు. గత మూడేళ్లలో ఖాతాలో ఎటువంటి పెద్ద లావాదేవీ జరగలేదని వెల్లడైంది. ఖాతా ఇనాక్టివ్ గా మారింది. దీంతో జ్యోతి ఖాతాను మూసివేయడానికి బ్యాంకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గత సంవత్సర కాలంగా జ్యోతి బ్యాంకు ఖాతాలో రూ. 10 కంటే తక్కువ డబ్బు ఉంది. ఖాతాలో నిర్దేశించిన కనీస మొత్తం కంటే తక్కువ ఉన్నప్పుడు, నిందితురాలు జ్యోతి మల్హోత్రా అకస్మాత్తుగా విదేశాలకు వెళ్లడానికి డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది అని దర్యాప్తు చేస్తున్నారు.ఆమె పాకిస్తాన్, చైనా, దుబాయ్, థాయిలాండ్ వంటి దేశాలకు ప్రయాణించి అక్కడి ఖరీదైన హోటళ్లలో బస చేసింది. ఇదే కాకుండా ఆమె దేశంలోని అనేక రాష్ట్రాల్లో పర్యటించింది. నిందితురాలు జ్యోతి మల్హోత్రా సోషల్ మీడియా ద్వారా తన ఆదాయం కంటే ఎక్కువ డబ్బు సంపాదించేదని పోలీసుల దర్యాప్తులో తేలింది. పోలీసులు పీఎన్‌బీ బ్యాంకుకు చేరుకునే ముందు, వారు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి జ్యోతికి సంబంధించిన ఖాతాల వివరాలను కూడా సేకరించారు. ఆ ఖాతాలు జ్యోతికి చెందినవా లేదా ఆమె బంధువులకు చెందినవా అనే దాని గురించి పోలీసులు, బ్యాంకు అధికారులు సమాచారం ఇవ్వడానికి నిరాకరించారు.

## పార్టీ మహిళా కార్యకర్తతో బీజేపీ సీనియర్ నేత అసభ్య ప్రవర్తన



లక్నో: యూపీలో ఓ సీనియర్ బీజేపీ నేత మహిళా కార్యకర్తతో అసభ్యంగా ప్రవర్తించిన ఉదంతం ప్రస్తుతం రాష్ట్రంలో కలకలం రేపుతోంది. ఏప్రిల్ 12న గోండా నగరంలోని పార్టీ ఆఫీసులో ఈ ఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీ నెట్టింట వైరల్ కావడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.సీనియర్ నేత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అమర్ కిశోర్ కశ్యప్ పార్టీ ప్రధాన కార్యాలయంలో మెట్లపై నిలబడి ఓ మహిళా కార్యకర్తతో అసభ్యంగా ప్రవర్తించినట్టు వీడియోలో రికార్డయ్యింది. మరో పార్టీ నేత ఈ విషయంపై అధిష్ఠానానికి ఫిర్యాదు చేయడంతో ఇది వెలుగులోకి వచ్చింది. కశ్యప్ ప్రవర్తన పార్టీకి తలవంపులు తెస్తోందని ఆ నేత అధికారికంగా ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పార్టీ రాష్ట్ర నాయకత్వం కశ్యప్‌కు షో కాజ్ నోటీసులు జారీ చేసింది.ఈ ఆరోపణలను బీజేపీ నేత కశ్యప్ కొట్టి పారేశారు. ఇదంతా తనపై ప్రత్యర్థులు చేస్తున్న కుట్ర అని ఆరోపించారు. తనంటే గిట్టని వాళ్లు వదంతులు వ్యాపిస్తున్నారని మండిపడ్డారు. "వీడియోలోని మహిళ మా పార్టీ కార్యకర్త. ఆ రోజు ఆమెకు ఆరోగ్యం బాగాలేదు. రెస్టు తీసుకునేందుకు స్థలం చూపించమని చెప్పింది. దీంతో, ఆఫీసుకి తీసుకెళ్లాను. మెట్లు ఎక్కుతుండగా ఆమెకు కళ్లు తిరిగాయి. అప్పుడు నేను హెల్ప్ చేశాను. కానీ ఆ ఫుటేజీ సాయంతో నాపై దుష్ప్రచారం చేస్తున్నారు. పరువు తీసేందుకు ప్రయత్నిస్తున్నారు" అని కశ్యప్ అన్నారు.వీడియో వైరల్ అయిన వెంటనే కశ్యప్ తన వివరణ ఇచ్చుకున్నా కూడా బీజేపీ రాష్ట్ర నాయకత్వం మాత్రం ఈ ఉదంతాన్ని సీరియస్‌గా తీసుకుంది. పార్టీ జనరల్ సెక్రెటరీ గోవింద్ నారాయణ్ శుక్లా కశ్యప్‌కు షో కాజ్ నోటీసులు జారీ చేశారు. పార్టీ ఇమేజీపై ఈ ఉదంతం ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉందని లేఖలో పేర్కొన్నారు. "వైరల్ వీడియోతో వెలుగులోకొచ్చిన ఉదంతం పార్టీ పరువుకు భంగం కలిగించేలా ఉంది. కాబట్టి, ఇది క్రమశిక్షణ రాహిత్యం కిందకు వస్తుంది" అని నోటీసుల్లో రాసుంది. ఈ లేఖకు ఏడు రోజుల్లోగా లిఖితపూర్వకంగా సమాధానం చెప్పాలని కూడా రాష్ట్ర నాయకత్వం డిమాండ్ చేసింది. సంతృప్తికరమైన జవాబు ఇవ్వని పక్షంలో క్రమశిక్షణ చర్యలు తప్పవని కూడా హెచ్చరించింది.

## 18 మంది బీజేపీ ఎమ్మెల్యేల సస్పెన్షన్ ఎత్తివేత.. స్పీకర్ ఉత్తర్వులు..!



బెంగళూర్ :కర్ణాటక అసెంబ్లీలో రెండు నెలల క్రితం అనుచిత ప్రవర్తన కారణంగా ఆరు నెలల పాటు సస్పెండ్ చేయబడ్డ 18 బీజేపీ ఎమ్మెల్యేలపై విధించిన నిషేధాన్ని స్పీకర్ ఖాదర్ ఆదివారం అధికారికంగా ఎత్తివేశారు.ఈ నిర్ణయం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, ప్రతిపక్ష నేత ఆర్. అశోక, న్యాయ శాఖ మంత్రి హెచ్.కే. పాటిల్‌లతో సమావేశం అనంతరం నిర్ణయం తీసుకున్నారు. మార్చి 21న బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో స్పీకర్‌కు వ్యతిరేకంగా వ్యవహరించడంతో వారిపై "అనుచిత ప్రవర్తన" ఆరోపణలతో సస్పెన్షన్ విధించబడింది. ఆ సమయంలో ఎమ్మెల్యేలు స్పీకర్ కుర్చీ చుట్టూ చేరి ఆందోళన చేపట్టారు. కొంతమంది కాగితాలు విసిరి హల్చల్ సృష్టించడంతో, వారిని మార్షల్స్ బలవంతంగా బయటకు తరలించాల్సి వచ్చింది.ఇక తాజాగా జరిగిన సమీక్ష సమావేశం అనంతరం స్పీకర్ ఖాదర్ మీడియాతో మాట్లాడుతూ.. అది ఒక నిర్బంధ పరిస్థితిలో జరిగిన సంఘటన. అయితే నేటి సమావేశంలో మంత్రులు, ప్రతిపక్ష నాయకులు కలిసి చర్చించి సస్పెన్షన్ ఎత్తివేసేందుకు నిర్ణయం తీసుకున్నాం. ఎమ్మెల్యేలు మా శత్రువులు కాదు, మిత్రులే అని అన్నారు. అంతేకాక, ఈ నిర్ణయాన్ని శాసనసభ వచ్చే సమావేశంలో అధికారికంగా ఆమోదిస్తారు. అన్ని పార్టీలు సంఘర్షణకు బదులు చర్చల ద్వారా పరిష్కారం కనుగొనాలి. బీజేపీ ఎమ్మెల్యేలు తమ తప్పును గ్రహించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలి అని అన్నారు.సస్పెన్షన్ ఎత్తివేతపై కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ కూడా ముఖ్యమంత్రి, స్పీకర్‌లకు లేఖ రాశారు. అలాగే కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, శోభా కరంద్లాజే వంటి నాయకులు కూడా స్పీకర్‌ను సంప్రదించారు. ప్రతిపక్ష నేత అశోక ఈ విషయంలో అనేకసార్లు స్పీకర్‌ను కలిశారు. ఆయన నుంచి లిఖితపూర్వకంగా క్షమాపణల లేఖ కూడా అందిందని ఖాదర్ వెల్లడించారు. సస్పెన్షన్ ఎత్తివేసిన ఎమ్మెల్యేలలో ముఖ్యంగా దొడ్డనగౌడ జి. పాటిల్, మాజీ డిప్యూటీ సీఎం సి.ఎన్. అశ్వత్ నారాయణ్, ఎస్.ఆర్. విశ్వనాథ్, బి.ఏ. బసవరాజు, బి.పి. హరీష్, చంద్రు లామాణి, మునిరత్న తదితరులు ఉన్నారు.

## పుతిన్‌కు ఏమైంది.. పిచ్చి పట్టిందా: డొనాల్డ్ ట్రంప్



న్యూయార్క్: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్(డొనాల్డ్ ట్రంప్). తాజాగా ఉక్రెయిన్‌పై భీకర స్థాయిలో రష్యా తన డ్రోన్లు, మిస్సైళ్లతో దాడి చేసింది. ఈ నేపథ్యంలో మీడియాతో ట్రంప్ సూచన.. పుతిన్ అనుసరిస్తున్న విధానాలు పట్ల అసంతృప్తితో ఉన్నట్టు తెలిపాయి. అతనికి ఏమైంది? అనేక మంది ప్రాణాలు బలి తీసుకుంటున్నాడు.. పుతిన్‌కు పిచ్చి పట్టిందా అని ట్రంప్ ఫైర్ అయ్యారు. ఏ కారణం లేకుండానే రహస్య దాడులు చేస్తున్నారు.గత వారం రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులను ఉధృతం చేసింది. సుమారు 764 ఉక్రెయిన్ డ్రోన్లను రష్యా తన భూభాగంలోనే అడ్డుకున్నది. కుర్స్క్ ప్రాంతంలో పర్యటిస్తున్న సమయంలో అధ్యక్షుడు పుతిన్ హెలికాప్టర్ చుట్టూ డ్రోన్ దాడి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనికి బదులుగానే రష్యా మిలిటరీ.. ఉక్రెయిన్‌పై అటాక్ చేసింది. కీవ్‌లో ఉన్న డ్రోన్, మిస్సైల్ ప్రొడక్షన్ ప్లాంట్‌పై దాడి చేశారు.ఆదివారం రష్యా జరిపిన డ్రోన్ దాడిలో 12 మంది ఉన్నారు. సుమారు 367 డ్రోన్లు, మిస్సైళ్లతో రష్యా అటాక్ చేసింది. డ్రోన్లు, మిస్సైళ్ల దాడి సమయంలో ఉక్రెయిన్‌లోని కీలక ప్రాంతాలలో ఎయిర్ సైరన్లు మోగాయి.

## మహారాష్ట్రలో వర్ష బీభత్సం..



ముంబై:నైరుతి రుతుపవనాల రాకతో పలు రాష్ట్రాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, ఏపీ, తెలంగాణలో వానలు దంచికొడుతున్నాయి. కేరళ తర్వాత, నైరుతి రుతుపవనాలు సమయానికి ముందే మహారాష్ట్రకు చేరుకున్నాయి.ఆదివారం మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాల కారణంగా, పూణే-సోలాపూర్ హైవే జలమయం అయింది. రోడ్లు నదులను తలపించాయి. రోడ్లపై నీరు ఉధృతంగా ప్రవహించడంతో కార్లు కొట్టుకుపోయాయి. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.భారీ వర్షాలు ప్రజల్లో భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. అప్రమత్తమైన అధికార యంత్రాంగం వెంటనే సహాయక చర్యలు ప్రారంభించింది. రాబోయే కొద్ది గంటల్లో మరిన్ని వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. అనవసరమైన ప్రయాణాలకు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.రాబోయే మూడు రోజుల్లో ముంబై, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో రుతుపవనాలు వ్యాపిస్తాయని IMD తెలిపింది. మధ్య అరేబియా సముద్రం, కర్ణాటక (బెంగళూరుతో సహా), ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలు, తమిళనాడులోని మిగిలిన ప్రాంతాలు, పశ్చిమ-మధ్య, ఉత్తర బంగాళాఖాతం, ఈశాన్య రాష్ట్రాలలోని మరికొన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది.

## సంపాదకీయం

**మంగళవారం 27-05-2025**

# శ్వేతసౌధంలో మళ్లీ 'పంచాయితీ'

అతిథుల్ని పిలిచి బహిరంగంగా వాగ్యుద్ధానికి దిగటం ఏ రకంగా దౌత్యనీతి అవుతుందో, దాన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎక్కడ నేర్చారో ఎవరికీ తెలియదు. కానీ ఆయన దాన్ని కొనసాగించదల్చుకున్నారని దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రాంఫోసాతో వైట్‌హౌస్‌లో తాజాగా సాగిన జగడం నిరూపిస్తోంది. మొన్న ఫిబ్రవరిలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ట్రంప్ ఇదే మాదిరి తగువు పెట్టుకున్నారు. ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న దురాక్రమణ యుద్ధంలో తప్పంతా ఉక్రెయిన్‌దే అన్నట్టు తేల్చి, దాన్ని వెంటనే నిలిపేయాలని ఒత్తిడి తెచ్చారు.అడుగడుగునా అవమా నిస్తూ మాట్లాడారు. మళ్లీ మూణ్ణెల్లకు అదే వైట్‌హౌస్‌లో ట్రంప్ ఆ డ్రామాకే తెరతీశారు. నిజానికి ఇరు దేశాల అధినేతలు కలుసుకుని చర్చించినాక వారిద్దరూ కలిసి మాట్లాడే మీడియా సంయుక్త సమావేశం లాంఛనప్రాయమైనది. నాలుగు గోడలమధ్యా నిర్మొహమాటంగా మాట్లాడుకున్నా, వాదులాడుకున్నా... మీడియా సమావేశంలో పరస్పరం ప్రశంసించుకోవటాలు, రెండు దేశాల మధ్యా కుదిరిన ఒప్పందాల విశిష్టతను అతిగా చూపించుకోవటాలు జరిగిపోతాయి. ఇందువల్లరెండు దేశాల్లోనూ అధినేతలకు ప్రశంసలు దక్కుతాయి. కానీ ఇలాంటివి ట్రంప్‌కు పట్టవు. ప్రపంచానికి తాను మకుటంలేని మహారాజునని, ఎవరినైనా ఏమైనా అనగలనని అమెరికా శ్వేతజాతి ఓటరు మహాశయులకు ఆయన చెప్పదల్చుకున్నారు.అందుకే అతిథులుగా వచ్చిన అధినేతలను కెమెరాల ముందు ఇష్టానుసారం మాట్లాడటం అల వాటు చేసుకున్నారు. పోనీ ఆయన నిలదీస్తున్న అంశాలు గొప్పవేమీ కాదు. వాటిల్లో చాలామటుకు నకిలీవీ... నిరాధారమైనవీ. సామాజిక మాధ్యమాల్లో ఎవరెవరో పెట్టే తప్పుడు పోస్టింగులే వాటికి ఆధారం. ఉక్రెయిన్‌లో దేశాధినేతను మార్చి, ఆయన ద్వారా రష్యాను చీకాకుపెట్టి చివరకు అది రెచ్చిపోయి దాడిచేసే స్థితి కల్పించింది అమెరికాయే. అటు తర్వాత రష్యాను ప్రపంచంలో ఏకాకిని చేయటానికి ప్రయత్నించి, ఉక్రెయిన్‌కు పెద్దయెత్తున ఆయుధాలు అమ్ముకున్నది అమెరికాయే. నాటో దేశాలను సైతం ఈ రొంపిలోకి దించింది కూడా ఆ దేశమే. జో బైడెన్ హయాంలో ఇవన్నీ జరిగినట్టు తెలిసినా, ట్రంప్ ఏమీ తెలియనట్టు నటించారు. ఉక్రెయిన్‌నే వేలెత్తి చూపారు. ఇప్పుడు రాంఫోసాతో సైతం అదే తరహాలో వ్యవహారం నడిపారు. దక్షిణాఫ్రికాలో శ్వేతజాతీయుల ఊచకోత సాగుతున్నదనీ, వాటిల్లో చాలాభాగం బయటకు రావటం లేదనీ ట్రంప్ వాదించారు. ఒకప్పటి శ్వేతజాతి పాలనలో నల్లజాతీయులపై అఘాయి త్యాలు జరిగాయని ఒప్పుకుంటూనే ఇప్పుడు నల్లజాతి పాలనలో శ్వేతజాతీయుల్ని ఆ మాదిరేహింసిస్తున్నారని చెప్పుకొచ్చారు. మీ వద్ద ఆధారాలున్నాయా అని రాంఫోసా అడిగితే, లేవని అంగీ కరిస్తూనే ట్రంప్ ఒక వీడియో ప్రదర్శించారు. అందులో నల్లజాతి వామపక్ష నాయకుడు జూలియస్ మలేమా 'శ్వేతజాతి ఆఫ్రికన్లను హతమార్చండ'ంటూ నినాదాలిస్తున్న దృశ్యాలు కనబడ్డాయి. మొత్తం గంటసేపు జరిగిన ఈ మీడియా సమావేశంలో రాంఫోసా ఎక్కడా ఆవేశానికి పోకుండాఎంతో సంయమనంతో ట్రంప్‌కు జవాబిచ్చే ప్రయత్నం చేశారు. నిజానికి దక్షిణాఫ్రికాలో ఇప్పటికీ నాలుగింట మూడొంతుల వ్యవసాయ భూములు 8 శాతంకన్నా తక్కువ జనాభాగల శ్వేతజాతీయుల చేతుల్లో వున్నాయి. జనాభాలో 80 శాతంగా వున్న నల్లజాతీయులకు వ్యవసాయ భూముల్లో వాటా కేవలం 4 శాతం మాత్రమే. కానీ ట్రంప్ మాత్రం దక్షిణాఫ్రికా ప్రభుత్వం శ్వేతజాతీయుల భూముల్ని గుంజుకుని వాటిని నల్లజాతీయులకు పంచు తున్నదని ఆరోపించారు. శ్వేతజాతి దురహంకార పాలనలో నల్లజాతీయుల నుంచి అక్రమంగా చేజిక్కించుకున్న భూములు వెనక్కిప్పించాలని స్థానికులు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నా అక్కడి ప్రభుత్వం అంగీకరించటం లేదు. దానికి బదులు స్వచ్ఛందంగా అమ్మటానికి సిద్ధపడే శ్వేత జాతీయులకు పలు రాయితీలిస్తున్నది. శ్వేతజాతి రైతుల ఊచకోత సాగుతున్నదన్న ట్రంప్ వాదన కూడా పూర్తి అబద్ధం. నేరాల రేటు చూస్తే ప్రపంచంలోనే దక్షిణాఫ్రికా ముందుంది. అక్కడ సగటున రోజుకు 72 హత్యలు జరుగుతాయి. ఆరుకోట్ల జనాభాగల ఆ దేశంలో హతుల్లో అత్యధికులు నల్లజాతీయులు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం నిరుడు 26,232 మంది హత్యకు గురైతే అందులో కేవలం 8 మంది మాత్రమే శ్వేతజాతి రైతులు. వాస్తవాలు ఇవికాగా ట్రంప్ వైట్‌హౌస్ వేదికగా ఒక దేశాధినేతపై ప్రపంచమంతా చూస్తుండగా దబాయించటం ఎంత దారుణం! నిజానికి రెండు దేశాలూ చర్చించి పరిష్కరించుకోవాల్సినవి చాలావున్నాయి. శ్వేతజాతి రైతుల ఊచకోత ప్రచారాన్ని నమ్మటంతో బైడెన్ హయాంలోనే నిధులు ఆపేశారు. ట్రంప్ వచ్చాక 25 శాతం సుంకాల విధింపును ప్రకటించారు. ఆ దేశంలోని సహజ వనరులపై ట్రంప్ కన్నుపడింది. వీటిపై అర్థవంతమైన చర్చలు జరగకుండానే తప్పుడు ప్రచారంపై వాదులాట సాగింది. గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న ఊచ కోతపై ధైర్యంగా అంతర్జాతీయ న్యాయస్థానం తలుపుతట్టింది దక్షిణాఫ్రికాయే. రాంఫోసా అదృష్టం బాగుండి ట్రంప్‌కు ఆ సంగతి గుర్తురాలేదు. లేకుంటే మరింతగా విరుచుకుపడేవారు. వర్తమాన ప్రపంచంలో పలు దేశాధినేతలు తప్పుడు సమాచారాన్నీ, వదంతుల్నీ ప్రచారంలో పెట్టి అధికారంలోకొచ్చినవారే. ఈ ఎత్తుగడలే మరోసారి అందలం ఎక్కిస్తాయని... రాజ్యాంగాన్ని సవరించి మూడోసారి అధ్యక్షుడు కావాలని కలగంటున్న ట్రంప్ విశ్వసిస్తున్నారు. ఇలాంటపుడు అమెరికాలో అడుగుపెట్టడానికీ, ట్రంప్‌తో చీవాట్లు తినటానికీ ఏ దేశాధినేతయినా ధైర్యం చేయగలరా?

# దయ్యాలతో నెయ్యం.. దేవుడితో కవిత కయ్యం



హైదరాబాద్,రాష్ట్రంలో పరిపాలన, శాంతిభద్రతల పరిస్థితి, మీడియాలో వస్తున్న వార్తలగురించి రోజూ ఉదయమే ముఖ్యమంత్రికి ఉన్నతాధికారులు బ్రీఫింగ్ ఇస్తుంటారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నిఘా విభాగం అధిపతి, సమాచార శాఖ కమిషనర్ రోజూ ఉదయమే మొట్టమొదట ముఖ్యమంత్రిని కలిసేవాళ్ళలో ఉంటారు. వాళ్లు ముఖ్యమంత్రికి ఈ అంశాలమీద బ్రీఫ్ చేస్తారు. వాళ్ళ బ్రీఫింగ్‌ను బట్టి ముఖ్యమంత్రి తానేం చేయాలో నిర్ణయించుకుంటూ ఉంటారు. ఇది ఇవాళ్టి పద్ధతి కాదు, అనాదినుండి మన రాష్ట్రంలోనే కాకుండా దేశమంతా దాదాపుగా ఇలాగే జరుగుతుంది. ఈ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రిని ప్రత్యక్షంగా కలవలేకపోయిన సందర్భాలలో కనీసం టెలిఫోన్లోనైనా బ్రీఫ్ చేయడం అనేది కొనసాగుతూ వచ్చిన పద్ధతి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తొలి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు హయాంలో నిఘా విభాగం అధిపతిగా ఉండిన ఒక అధికారి అత్యంత గోప్యంగా ఉంచవలసిన శాంతిభద్రతలకు సంబంధించిన రోజువారీ నివేదికలను ముఖ్యమంత్రికి కాకుండా ఆయన మంచిచెడ్డలు చూసుకునే ఒక సన్నిహిత బంధువుకు చెప్పాల్సి వస్తున్నది,

ఇది పద్ధతికి విరుద్ధమని తన సన్నిహితులతో చెప్పుకొని వాపోయేవాడు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎక్కువ కాలం ప్రగతి భవన్లో ఉండి ఎవరికీ అందుబాటులో ఉండేవారు కాదని బయట ప్రచారం. ముఖ్యమంత్రిగా ఆయన సచివాలయానికి కూడా వెళ్లిన దాఖలాలు లేవు. మొత్తం ఆయన దాదాపు పది సంవత్సరాలు అధికారంలో ఉంటే ఏ మూడు నాలుగు సందర్భాల్లోనో సచివాలయానికి వెళ్లి ఉంటారు. అది ఆయన వ్యవహారశైలి. ఒక్కో ముఖ్యమంత్రికీ ఒక్కో రకమైన శైలి ఉంటుంది. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డిని ఉదాహరణగా తీసుకుంటే ఆయన దినచర్య ఉదయం నాలుగు గంటలకు మొదలయ్యేది. దాదాపు 5:30 నుండి ఆయన అధికారిక కార్యక్రమాలు మొదలైనట్టే. పైన పేర్కొన్న అధికారులు ఆయనకు బ్రీఫింగ్ ఇవ్వడం, సరిగ్గా తొమ్మిది గంటలకు గడియారం చూసుకుని క్యాంప్ ఆఫీస్ బయటకు వచ్చి ఆరోజు అక్కడికి వచ్చి వరుసలో నిలబడిన సామాన్య జనం ప్రతి ఒక్కరినీ స్వయంగా కలిసి వాళ్ల సమస్యలు విని మహజర్లు స్వీకరించి వాటికి సంబంధించి అధికారులకు ఆదేశాలు అక్కడికక్కడే జారీ చేసి తదుపరి క్యాంపు కార్యాలయంలో వేచి ఉన్న వాళ్లందర్నీ కూడా కలిసి 10:30 గంటలకల్లా సచివాలయం చేరుకునేవారు. ఇలా, ఒక్కొక్క ముఖ్యమంత్రి ఒక్కొక్క రకంగా పనిచేస్తుంటారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి రెండు రాష్ట్రాలుగా విడిపోయిన ఈనాటి వరకు 18 మంది ముఖ్యమంత్రులు పాలించారు. ఒక్కొక్కళ్ళది ఒక్కో తీరు. ముఖ్యమంత్రి రోజూ అందరినీ కలవడం అంటే కిందినుండి పైదాకా అధికార యంత్రాంగం, ఇతర ప్రజాప్రతినిధులు పనిచేయడం లేదన్నట్టే కదా, సమస్యలు ముఖ్యమంత్రిదాకా రావాల్సిన పరిస్థితి ఉందంటే పరిపాలనలో లోపం ఉన్నట్టే కదా అనే వాదన ఆ మధ్య మాజీమంత్రి కెసిఆర్ కుమారుడు కెటి రామారావు ఒక సందర్భంలో వినిపించారు. ఇవన్నీ నిజమే కానీ, ముఖ్యమంత్రులు అయినా ప్రధానమంత్రులు అయినా ఎంత పెద్దవారైనా సరే కుటుంబ సభ్యులను కూడా కలవకుండా ఉండడం అనేది కొంచెం ఆశ్చర్యం కలిగించే విషయం. కెసిఆర్ అధికారంలో ఉండగా ప్రగతి భవన్‌లో ఉన్నా, ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో ఉన్నా ఆయన్ని కలవాలంటే కుటుంబ సభ్యులు కూడా అపాయింట్‌మెంట్ కోరాల్సిందేనని చాలాసార్లు విన్నాం. ముఖ్యమంత్రిని తాము కలవకుండా అడ్డుకుంటున్నాడని ఆయన రోజువారీ వ్యవహారాలు చూసుకునే మాజీ రాజ్యసభ సభ్యుడు, ఆయన సమీప బంధువు సంతోష్ కుమార్‌ను నిందిస్తూ ఉండేవారు. ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే అన్న సామెత చందంగా ముఖ్యమంత్రి అయినా, ప్రధానమంత్రి అయినా సొంత బిడ్డలను కూడా కలవకుండా ఉండడం అనేది అసహజంగానే ఉంటుంది.ఇప్పుడు అసలు విషయానికి వద్దాం. మాజీ ఎంపి, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తండ్రికి ముఖాముఖి చెపితే సరిపోయే విషయాలను ఓ లేఖలో రాసి పంపారు. సహజంగా తండ్రులకు కూతుళ్లపట్ల ప్రేమ ఎక్కువ ఉంటుంది. ఆడపిల్లలకు తల్లికంటే తండ్రిదగ్గర చనువు ఎక్కువ. కవిత ఆ చనువు ఎందుకు కోల్పోయారు అన్నది ప్రశ్న. పార్టీ నడుస్తున్న తీరు, రజతోత్సవ సభలో తండ్రి ప్రసంగం సాగిన తీరు, ఆయన వ్యవహార శైలి మీద కొన్ని మంచి విషయాలు, కొన్ని మారాల్సిన విషయాలు వివరిస్తూ ఆమె మే రెండవ తేదీన రాసిన లేఖ అది. దాదాపు 20 రోజుల తర్వాత ఈ లేఖ మీడియాకు లీక్ అయింది. ఒకటి.. తండ్రికి రాసిన లేఖ ఎలా లీక్ అయింది? రెండు.. ఎవరు లీక్ చేసి ఉంటారు? 24 గంటల్లోనే దీనిమీద మీడియా బోలెడు చర్చ చేసింది. కొందరు ఇది నకిలీ ఉత్తరం అన్నారు. మరికొందరు కాంగ్రెస్ వారే రాయించారు, వారే లీక్ చేశారన్నారు. మరికొందరు కవిత తనంతటతానే దీన్ని లీక్ చేయించారని ప్రచారం చేశారు. ఇంకాస్త దూరం వెళ్లి ఆమె కాంగ్రెస్‌లో చేరబోతున్నారని ఒక వాదన, లేదు లేదు బిజెపితో కలవబోతున్నారని మరొక వాదన, ఈ రెండూ కాదు, సొంత పార్టీ పెట్టబోతున్నారని ఇంకొక వాదన, అసలు ఇదంతా కెసిఆర్ ఆడిస్తున్న డ్రామా అని మరో వాదన జోరందుకున్నాయి. శుక్రవారం సాయంత్రం కవిత అమెరికా నుండి తిరిగి వచ్చి విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడేంతవరకూ మీడియాకు బోలెడు మేత దొరికింది. ఏది తోచితే అది రాశారు, మాట్లాడారు. కవిత ఆ లేఖ తాను రాసిందేనని, పార్టీలో ఉన్న కోవర్టులు ఆ లేఖను మీడియాకు లీక్ చేసి ఉంటారని, తాను పార్టీకి నష్టం చేసే మనిషిని కాదని వివరించేదాకా లేఖ అసలు, నకిలీ గురించి చాలా చర్చ జరిగింది. చాలా రోజులుగా భారత రాష్ట్ర సమితిలో కెసిఆర్ కింద మూడు అధికార కేంద్రాలు పని చేస్తున్నాయని, వాటి మధ్య అంతర్గత ఘర్షణ తీవ్రంగా ఉన్నదని వార్తలు వస్తూనే ఉన్నాయి. కవిత లేఖ, దానిమీద శుక్రవారంనాడు ఆమె స్పందన.. ఆ వార్తలను ధ్రువీకరిస్తున్నాయి. కవిత రాసిన లేఖలో ఉన్న అంశాలనే గనక తీసుకున్నట్లయితే నిజానికి కెసిఆర్ పరిగణనలోకి తీసుకొని మార్చుకోవాల్సిన అంశాలు చాలా ఉన్నాయి. ఇంతకుముందే చెప్పుకున్నట్టుగా ఒక్కొక్క ముఖ్యమంత్రి వ్యవహార శైలి ఒక్కో రకంగా ఉంటుంది. కెసిఆర్ తన ఫీడ్ బ్యాక్ కోసం ఎటువంటి పద్ధతులను అనుసరిస్తారో మనకు తెలియదు. జనంలో మనం తిరగనప్పుడు వాళ్ళు మన గురించి ఏమనుకుంటున్నారు అనే విషయం తెలుసుకోవడానికి ఏ ముఖ్యమంత్రి అయినా కొన్ని పద్ధతులు అవలంబిస్తారు. కెసిఆర్ ఎటువంటి పద్ధతి అవలంబిస్తారో మనకు తెలియదు, కవిత మాటల ప్రకారమైతే అప్పుడప్పుడు తాను లేఖల ద్వారా ఇలాంటి ఫీడ్ బ్యాక్ ఇస్తుంటానని చెప్పారు.ఆమె లేఖలో పేర్కొన్న నెగటివ్ అంశాల విషయానికొస్తే రజతోత్సవంలో భారతీయ జనతా పార్టీని టార్గెట్ చేయకపోవడాన్ని నెగిటివ్ అంశంగా పేర్కొన్నారు. నిజమే, భారత రాష్ట్ర సమితి శ్రేణుల్లోనే గందరగోళం ఉన్నది.. భవిష్యత్తులో బిజెపితో తమది దోస్తీనా, దుష్మనీనా అని. ఎందుకంటే కెసిఆర్ మాట్లాడటం లేదు, కె.టి. రామారావు, హరీశ్ రావులాంటి వాళ్ళు ఎన్ని మాట్లాడినా అది శంఖంలో పోసిన తీర్థం కాబోదు. రజతోత్సవ సభలో వక్ఫ్ బిల్లు గురించి మాట్లాడి ఉండవలసింది, దాన్ని వ్యతిరేకిస్తున్నారా లేదా, టిఆర్ఎస్‌తో నడిచే మైనారిటీలకు ఏం చెప్పదలచుకున్నారు, ఎస్‌సి వర్గీకరణకు సంబంధించి కూడా ఎందుకు మాట్లాడలేదు, బిసిలకు 42% రిజర్వేషన్ల గురించి మాట్లాడలేదు.. ఇలా ఆమె పలు అంశాలను ప్రస్తావించారు.వీటిలో ప్రధానమైనవి ఉద్యమ నేతలను పట్టించుకోకపోవడం, కొద్దిమందికే అందుబాటులో ఉండడం అనేవి ప్రధానమైన విషయాలు. ప్రజాస్వామ్యంలో రాజకీయ నాయకుడు వీలైనంత ఎక్కువమందిని కలిస్తేనే ప్రజామోదం పొందగలుగుతాడు. ఆ విషయాలను కవిత ప్రస్తావించారు.

# మిస్ వరల్డ్‌లో రాజకీయ కుట్ర కోణం?

హైదరాబాద్,మిస్ ఇంగ్లండ్ మ్యాగీ వ్యవహార శైలి కాస్త అనుమానాస్పదంగానే ఉందంటున్నారు. బేసిగ్గా స్విమ్మర్ అయిన మ్యాగీ తన తల్లి నుంచి, స్విమ్మింగ్ నుంచి ఏమి నేర్చుకుందోగానీ కొన్నికొన్ని విషయాల్లో ఆమెను తీవ్రంగా అనుమానించాల్సి వస్తోందని అంటారు కొందరు.మిస్ వరల్డ్ పోటీలకు అనగా ఇప్పటికిప్పుడొచ్చిన నష్టం ఏమీ లేదు. ఎందుకంటే 1951లో ఫెస్టివల్ ఆఫ్ ఇంగ్లండ్ లో ఒక బికినీ షోతో మొదలైన ఈ పోటీలు.. ఆనాడే వివాదాస్పదం. ఆ తర్వాత అదిప్పటికి అరడజను సార్లకు పైగా రకరకాల వివాదాలతో తీవ్ర అభ్యంతరాలను ఎదుర్కుంది. తెలుపు– నలుపు, మతానికి సంబంధించి, ఆపై కోవిడ్ వంటి విషయాల్లో ఈ పోటీలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. ఆ మాటకొస్తే హైదరాబాద్ లోనూ వ్యతిరేకతలు ఎదురయ్యాయి. కొన్ని ప్రజా సంఘాల వారు ఈ పోటీలను తొలి నుంచీ వ్యతిరేకిస్తూనే ఉన్నారు. ఇప్పుడు కూడా ఇక్కడ కూడా వ్యతిరేకించారు. అయితే ఇక్కడ మ్యాగీ విషయంలో కొన్ని అభ్యంతరాలేంటంటే.. ఇది ఒక ఇంగ్లండ్ కి సంబంధించిన పీజెంట్. ఆమె మరెవరో కాదు మిస్ ఇంగ్లండ్. అలాంటిది తన దేశానికి సంబంధించిన ఒక పోటీలో పాల్గొని.. ఎలాగోలా ఇక్కడి స్థితిగతులను అవగతం చేసుకుని వాటిని పూర్తి చేసి.. ముందుకెళ్లి కిరీటం దక్కించుకోవాలి. ఆమెకంటూ ఈ కిరీటం దక్కదనుకుందో ఏమో తెలీదు. కానీ ఆమె అయితే అర్ధాంతరంగా అది కూడా ఒక అబద్ధం చెప్పి తప్పుకుంది. తన తల్లికి బాగోలేదని ఆమె చెప్పడం విడ్డూరం. ఇది ఎప్పటికీ స్ఫూర్తి కాదు. రెండో విషయం ఇక్కడందరూ తననొక వేశ్యను చూసినట్టు చూస్తున్నారంటే.. అర్థమేంటి? ఇక్కడో మాట అక్కడో మాట చెప్పడంలో మీనింగ్ ఏమనుకోవాలి?అంటే మిగిలిన కంటెస్టెంట్లంతా వేశ్యలనా? లేక హైదరాబాద్ అంటే అతి పెద్ద విటుల సంఘమనా ఒక రకంగా చెబితే ఆమె చేసిన ఈ వ్యాఖ్యానాల వల్ల ఆమె ఒక్కరే శుద్ధ పూస మిగిలిన వారాంతా వ్యభిచారులని. అంతేగా దీనర్థం! మరో ముఖ్యమైన విషయం.. ఇటు వచ్చింది సాదా సీదా టూరిస్టుగా కాదు. ఒక దేశానికి ప్రతినిధిగా. పైపెచ్చు ఇదామె దేశానికి సంబంధించిన ప్రపంచంలోనే నాలుగో అతి పెద్ద బ్యూటీ ఈవెంట్. దాన్ని అపహాస్యం చేయడం అంటే తన దేశాన్ని సైతం అపహాస్యం చేయడంతో సమానం. మరో ఇంపార్టెంట్ థింగ్.. ఇది బ్యూటీ విత్ పర్పస్ గా 1980ల కాలం నాటి నుంచి ప్రాచుర్యం పొందింది. ఈ మొత్తం ఈవెంట్ ద్వారా సంపాదించిన మొత్తంలోంచి 1 బిలియన్ పౌండ్లను వికలాంగులు, అనాథ బాలలకు ఒక చారిటీగా ఇస్తారు. దీన్ని కూడా ఆమె కనీసం గుర్తించలేదు.ఇక పోతే హైదరాబాద్ కి లండన్ కొ ఒక పోలిక ఏంటంటే.. హైదరాబాద్ లోనూ లండన్లోనూ నదులుంటాయి. లండన్ నగర మధ్య భాగంలో థేమ్స్ నది ఉన్నట్టు.. ఇక్కడ కూడా మూసీ నది ఉంటుంది. ఈ ప్రభుత్వం మూసీ ప్రక్షాళనకు నడుం బిగించింది. తాను వచ్చేటపుడు ఈ విషయం కూడా తెలుసుకుని.. తాను ఈ దిశగా ప్రపంచ వ్యాప్తంగా విరాళాలు సేకరించి తన వంతు బాధ్యత




తీసుకోవచ్చు. అదీ మిస్ చేసిందీ మిస్ ఇంగ్లండ్. ఇక పోతే.. వచ్చే రోజుల్లో ఈమె అందానికి దాని వెనక ఉన్న తెలివికి మెచ్చి పొరబాటున ఐక్యరాజ్య సమితి ఈమెకు ఏ సోమాలియాకో పంపి అక్కడి మహిళలల్లో సంస్కరణ తీసుకురావాలని.. వారికంటూ ఆత్మ విశ్వాసాన్ని నూరిపోయాలన్న బాధ్యతలను అప్పగిస్తూ ఒక అంతర్జాతీయ రాయిబారిగా పంపితే అక్కడ వారు ఇలా చేశారు అలా చేశారు. అక్కడి అరటిపండ్లు, ఒంటె పాలు నేను తాగలేక పోయానంటే ఎలా ఉంటుంది?ఇదిలా ఉంచండి. బేసిగ్గా మ్యాగీ ఒక స్విమ్మర్. స్విమ్మింగ్ ఏం చెబుతుంది? ఎన్నేసి అవాంతరాలు ఎదురైనా వాటిని ఈదుకుంటూ వెళ్లాలని. కనీసం ఆ స్పిరిట్ కూడా ఆమె కొనసాగించలేక పోయారు. ఫైనల్ గా ఇక్కడ మ్యాగీ వ్యవహారశైలి అనుమానాస్పదంగా ఉన్నట్టు కనిపిస్తోంది. ఇక్కడున్న కొన్ని ప్రత్యర్ధి పార్టీ ఎన్నారై లింకులు అక్కడ మ్యాగీ మదర్ ని మేనేజ్ చేసి ఉంటారేమో.. అని అంటున్నారు కొందరు. అంతే కాదు ఇక్కడ ఒక రాజకీయ పార్టీ కరపత్రిక ఈ విషయంపై ఎంతో ఆతృత కనబరచి.. తద్వారా ఆమెకు ఫోన్ చేసి మరీ ఈ విషయం ఒక క్లారిటీ తెచ్చుకుని.. అక్కడున్న తమ యూకే ప్రతినిధి చేత ఇది బ్రాండ్ హైదరాబాద్ ఇమేజీకే డ్యామేజీ కలిగించే అంశమంటూ స్టేట్మెంట్ ఇప్పించారంటే.. దీని వెనక ఏ రాజకీయ కుట్ర కోణం లేదనుకోవాలా? అంటున్నారట కొందరు. మరి చూడాలి.. ఇలాంటి కుట్ర కోణాలు ఇందులో మరేవైనా దాగి ఉన్నాయో తెలియాల్సి ఉందంటున్నారు వీరు. ఏది ఏమైనా మ్యాగీ చాలా పెద్ద తప్పు చేశారు. ఇటు తన ఇంగ్లండ్ సంస్థ మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ కి, అటు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీకి మాయని మచ్చ తెచ్చారు. అంతే కాదు తనతో పాటు పాల్గొన్న ఇతర కంటెస్టెంట్లను కూడా ఆమె ఒక రకంగా వేశ్యలని ఇండైరెక్ట్ స్టేట్మెంట్ ఇచ్చారు. ఇది తప్పకుండా కోటిన్నరకు పైగా జనాభాగల సగటు హైదరాబాద్ వాసి ఖండించాల్సి ఉందని అంటారు కొందరు సామాజిక వేత్తలు. మరి మీరేమంటారు?

# చిత్తవుతున్న ధాన్యం రైతులు

ఆదిలాబాద్,ఎన్నిచర్యలు తీసుకున్నా,అధికారులు పర్యవేక్షిస్తున్నా రైతుకు దళారుల బెడద తప్పడం లేదు. గత్యంతరం లేని రైతులు మధ్య దళారులకే విక్రయిస్తున్నారు. ధాన్యం అమ్మకాల్లో రైతులు ఏటా సమస్యలు ఎదుర్కొంటున్నా వారిని పట్టించుకోవడం లేదు. అకాల వర్షాలతో పంట దెబ్బతిని దిగుబడి తగ్గిందని ఓ వైపు ఆందోళన చెందుతుంటే మరోవైపు పంట కొనుగోళ్లు లేక కలవరపడుతున్నాడు. నిబంధనల పేరిట ప్రభుత్వరంగ సంస్థలు ఇబ్బంది పెడుతుంటే.. దళారులు ధర తగ్గించి పంట కొనుగోలు చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో జిల్లాల్లో దళారులది ఆడిందే ఆటగా మారింది. మొదట్లో పంట బాగానే ఉన్నా అకాల వర్షాల వల్ల పంట కొంత దెబ్బతింది. కొనుగోలులో అవకతవకలు జరుగకుండా ఉండాలనే ఆలోచనతో రైతులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులను కూడా జారీ చేశారు. మధ్య దళారులు రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముకోకుండా ఉండాలనే ఆలోచనతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయినా తేమశాతం పేరుతో తరుగు తీస్తున్నారు. అయితే అధికారులు నిబంధనలు పెట్టడంతో ఇప్పుడు పల్లెల్లోకి దళారులు వచ్చి నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఇందులో కూడా కొందరు తూకంలో మోసానికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పల్లెల్లో ఇలా ఏ గ్రామానికి వెళ్లినా మధ్య దళారులు ఇలా రైతుల ఇంటికి వెళ్లి తక్కువ ధరకే నేరుగాకొనుగోలు చేస్తున్నారు. ఇదంతా జరుగుతున్నా వ్యవసాయాధికారులుగానీ, మార్కెటింగ్ అధికారులుగానీ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

# పెరిగిన ధాన్యం దిగుబడులు

భద్రాద్రి కొత్తగూడెం,గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ధాన్యం దిగుబడి కూడా ఎక్కువగా పెరిగిందని అధికారులు అంటున్నారు. దీనికి తోడు ధాన్యం మద్దతు ధర కూడా పెరిగినందున రైతులు ఎక్కువ శాతం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దనే విక్రయాలు జరిపే అవకాశాలు ఉన్నాయి. దళారుల ప్రమేయం లేకుండా రైతులకు అన్ని సౌర్యాలు కల్పించారు. ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేసి రైతులకు సకాలంలో వారి ఖాతాల్లో సొమ్ములను జమ చేశారు. రైతు పండించిన పంటకు ప్రభుత్వం మద్దతుధర ఇచ్చిన కొను గోలు చేస్తోంది. అంచనాల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రైతులకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. జీసీసీ,ఐకేపీ, కోపరేటివ్ సొసైటీల ద్వారా ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా అందుబాటులోకి గన్నీ బ్యాగ్‌లను కూడా ఉంచారు. రైతులు విక్రయానికి తీసుకు వచ్చిన ధాన్యానికి వెంటనే పేమెంట్లు చేసేవిధంగా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేస్తామని అధికారులు అన్నారు. రెండు లక్షల 30 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని నిర్ణ యించారు. ఇంకా కొన్ని ప్రాంతాల నుంచి ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. ప్రాజెక్టుల కింద వరి కోతలు జరగనందున చాలా ధాన్యం పొలాల్లోనే ఉండిపోయింది.

# పంట మార్పిడితోనే మెరుగైన ఫలితాలు

విజయనగరం, రైతులు పంట మార్పిడి చేసుకోవడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవడంతో పాటు, పంటల దిగుబడి పెంచుకోవచ్చని వ్యవసాయాధికారులు తెలిపారు. ఏటా ఒకే పంట వెయ్యడం వలన దిగుబడులు ఆశించిన స్థాయిలో రావడం లేదని తెలిపారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. రైతులు పంట మార్పిడే కాకుండా కనీసం రకాలను మార్చడం లేదన్నారు. చెరకులో నూతన రకాలు ఉన్నాయని వాటిని సాగు చేసుకోవాలని చెప్పారు. విత్తనం నిమిత్తం ప్రత్యేకంగా తోటలు పెంచుకోవాలని వివరించారు. ఆరునెలల వయసు గల చెరకును విత్తనంగా వాడాలని చెప్పారు. చెరకులో బిందు సేద్యం ద్వారా నీరు, ఎరువులు ఇవ్వాలని చెప్పారు. జిల్లాలో ఏటా పూర్తిస్థాయిలో వర్షాలు పడుతున్నా కురుస్తున్న రోజుల సంఖ్య తగ్గిపోతోందన్నారు. ఒకేసారి ఎక్కువ వర్షం పడుతోందని.. ఇదంతా వృథాగా పోతోందని వివరించచారు. ఉన్న నీటిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. బిందు సేద్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, రైతులకు 90 శాతం రాయితీ ఇస్తున్నారని చెప్పారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఇద్దరి మధ్య తేడా ఇదేనా?

హైదరాబాద్,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వ్యవహారశైలిపై నెట్టింట ఆసక్తికర చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి హోదాలో నాంపల్లి కోర్టుకు హాజరైన రేవంత్ రెడ్డి తనపై నమోదైన కేసులపై వాంగ్మూలమిచ్చారు. ఈ కేసులు, తీర్పులు ఎలా ఉన్నా రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో కోర్టుకు రావడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇదే సమయంలో వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి కోర్టు కేసులు, ఇతరత్రా విషయాలపై చర్చ జరుగుతోంది.ముఖ్యమంత్రి కాకముందు నుంచి వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డిపై ఎన్నో కేసులు ఉన్నాయి. 2019లో వైసీపీ అధికారంలోకి రాకముందు ఆయన ప్రతి శుక్రవారం హైదరాబాదులోని సీబీఐ కోర్టుకు హాజరయ్యేవారు. ఎన్నికల ప్రచారం, పాదయాత్ర సమయంలో మాత్రం కోర్టు అనుమతితో మినహాయింపు పొందేవారు. అయితే ముఖ్యమంత్రి అయ్యాక ఆయన ప్రతివారం కోర్టుకు హాజరవుతారా? అనేది పెద్ద చర్చకు దారితీసింది. ముఖ్యమంత్రి హోదాలో ఆయన కోర్టుకు హాజరైతే భద్రత నిమిత్తం రోజుకు సుమారు రూ.60 లక్షలు వరకు ఖర్చు అవుతుందని అప్పట్లో కోర్టుకు నివేదించారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి విధుల్లో బిజీగా ఉన్నందున తనకు హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ఐదేళ్లలో ఒక్కనాడు కోర్టు గుమ్మం ఎక్కకుండా తప్పించుకున్నారని గుర్తు చేస్తున్నారు.అదేవిధంగా 2019 ఎన్నికల ముందు వైసీపీ అధినేత జగన్ పై విశాఖ విమానాశ్రయంలో కోడికత్తితో దాడి జరిగింది. ఈ కేసులో జనిపల్లి శ్రీనివాసరావు అనే యువకుడిని ఎన్ఐఏ అరెస్టు చేసింది. ఈ కేసులో సాక్ష్యం చెప్పాల్సిన జగన్ ఎన్ని నోటీసులిచ్చినా కోర్టుకు హాజరవ్వలేదు. ఏదో ఒక కారణం చూపి ఆయన సాక్ష్యం చెప్పకుండా తిరిగేవారని విమర్శలు ఎదుర్కొన్నారు. ఈ కేసులో జగన్ వ్యవహారశైలిపై నిందితుడు కుటుంబంతోపాటు పౌర హక్కుల నేతలు, న్యాయవాదులు పలుమార్లు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. జగన్ ఒక్కసారి కోర్టుకు రావాల్సిందిగా వేడుకున్నారు. కానీ, ఆయన ఏనాడూ కోర్టు మెట్లు ఎక్కేందుకు ఇష్టపడలేదు. తాను ముఖ్యమంత్రి హోదాలో ఉండగా, కోర్టుకు వెళ్లి బోనులో నిల్చోవడమేంటన్న ఆలోచనతో జగన్.. కోర్టు విచారణకు దూరం ఉండేందుకు ఇష్టపడేవారని చెబుతున్నారు. ప్రతిపక్షాలు సైతం ఇవే తరహా విమర్శలు చేసేవి..ఇక ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం జగన్ కు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఇద్దరికీ సంబంధం లేకపోయినా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులుగా పనిచేసిన నేతల మధ్య సారూపత్యలు, భిన్న వ్యక్తిత్వాలపై తరచూ చర్చ జరుగుతుంటుంది.

# మైసూర్ పాక్‌లో ..పాక్ మాయం !

జయపుర,మైసూర్‌పాక్‌లో పాక్ మాయమయ్యింది. దాని స్థానంలో శ్రీ వచ్చిచేరింది. ఇప్పుడు మైసూర్ పాక్ స్వీటుకాస్తా మైసూర్ శ్రీ గా మారింది. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా..ముమ్మాటికీ నిజం. పాక్ అనే శబ్దం లేకుండా స్వీట్ల పేర్లన్నీ మారాయి. చివరన అన్నింటికీ శ్రీ చేరింది. పహల్గాం ఉగ్ర దాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పాకిస్థాన్‌పై యావత్ భారతీయులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న ఆ దేశాన్ని అంతర్జాతీయ సమాజంలో ఏకాకిని చేయాలన్న డిమాండ్లు వినిపించాయి. ఇదే సమయంలో నెట్టింట మరో చర్చ మొదలైంది. మైసూర్‌పాక్ పేరును మార్చాలంటూ కొందరు సోషల్‌మీడియాలో ప్రతిపాదనలు చేశారు. కొందరైతే మరో అడుగు ముందుకేసి దీనిపై మీమ్స్ కూడా చేశారు. ఈ డిమాండ్ ఓ వ్యాపారికి బాగా నచ్చేసింది. అందుకే తమ దుకాణంలో విక్రయించే స్వీట్ల లో "పాక్" పదాన్ని తీసేసి కొత్త పేర్లు పెట్టారు. మైసూర్ పాక్ ను 'మైసూర్ శ్రీ'గా మార్చేశారు.రాజస్థాన్‌లోని జైపుర్‌లో గల ప్రముఖ 'త్యోహార్ స్వీట్స్' యజమాని ఈమేరకు తమ దుకాణంలో మార్పులు చేశారు. మైసూర్ పాక్‌తో పాటు-.. మోతీ పాక్, ఆమ్ పాక్, గోండ్ పాక్ పేర్లను మార్చి.. మైసూర్ శ్రీ, మోతీ శ్రీ, ఆమ్ శ్రీ, గోండ్ శ్రీ అని కొత్త పేర్లు పెట్టారు. స్వర్ణ భాషమ్ పాక్, చాందీ భాషమ్ పాక్‌ను కూడా స్వర్ణ శ్రీ, చాందీ శ్రీగా మార్చేశారు. దీనిపై ఆ దుకాణం యజమాని మాట్లాడుతూ.. దేశభక్తి అనేది కేవలం సరిహద్దుల్లో ఉంటే సరిపోదు. ప్రతి పౌరుడికి దేశంపై ప్రేమ ఉండాలి. అందుకే మేం ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.వాస్తవానికి 'పాక్' అనే పదం పాకం నుంచి వచ్చింది. కొన్ని భాషల్లో చక్కెర లేదా బెల్లంతో చేసే పదార్థాన్ని కూడా పాకం అని పిలుస్తాం. ఇక్కడ ఈ పదానికి పాకిస్థాన్‌తో సంబంధం లేనప్పటికీ.. ప్రజల్లో ఆ దేశాన్ని గుర్తుచేసేలా ఉండటంతోనే పేరు మార్చినట్లు తెలిపారు. 'శ్రీ' అనే పదం శుభానికి సూచికగా పెట్టినట్లు పేర్కొన్నారు. మొత్తానికి ఉత్తరాది మైసూర్ శ్రీ ఇప్పుడు ఫేమస్కానుంది.

# సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

శ్రీకాకుళం, వచ్చేది వర్షాకాలం. వర్షాకాలంఅంటేనే సీజనల్ వ్యాధులు ఇబ్బంది పెడుతాయి. ఏటా ఇలాంటి సమస్యలు చూస్తూనే ఉన్నాం. ఈ క్రమంలో ఇప్పటి నుంచే సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలి. వర్షాకాల వ్యాధులపై చైతన్యం చేయాల్సి ఉంది. రాష్ట్రంలో గతంలో ప్రజలు డెంగీ, తదితర వైరల్ జ్వరాలతో ఇబ్బందులు పడేవారు. కరోనా మరోమారు భయపెడుతోంది. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతలకు అలవాటు పడాలి. ఇది కొనసాగితే విషజ్వరాలు లేదా, అంటువ్యాధులు ప్రబలవని వైద్యనిపుణులు అంటున్నారు. ప్రతి ఏటా వానాకాలంలో అంటు వ్యాధులు ప్రబలడం సర్వసాధారణంగా మారింది. చలికాలం వచ్చే సరికి స్వైన్ ఫ్లూ లాంటి వ్యాధులు విజృంభిస్తుంటాయి. పట్టణాలు,పల్లెలు అనే తేడా లేకుండా స్వచ్ఛంగా ఉంచాలని పదేపదే ప్రచారం చేస్తున్నా ప్రజలు పట్టించుకోవడం లేదు. ఎవరికి వారు తమకేంటన్న భావనతో అపరిశుభ్రతకు కారణమవుతున్నారు. ముఖ్యంగా దోమల వృద్ధికి అవకాశం ఉన్న నీటి తొట్లు, నీటి నిలువ ప్రదేశాల్లో నీటిని తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. దీంతోపాటు ఇంటి మూలల్లో ఉన్న ఉపయోగంలో లేని వస్తువులను తీసివేసి, దోమల లార్వా వృద్ధికి అవకాశం లేకుండా చేసే చర్యలను చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పారిశుద్ధ్య నిర్వహణ పైన పైన దృష్టి సారించి సీజనల్ వ్యాధుల బారి నుంచి కాపాడుకునే ప్రయత్నం ప్రారంభించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఇళ్ళ ముందు కానీ లేదా ఇంటి లోపల నీటి నిలువ ఉండే ప్రాంతాల్లో నీటిని తొలగించే ప్రయత్నం చేయడం లేదా వాటిపైన నూనెను చల్లడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. దీంతోపాటు ఇళ్లలో ఉన్న పనికిరాని లేదా ఉపయోగం లేని లేని వస్తువులను తొలగించుకోవాలని కోరారు. అప్పుడేసీజనల్ వ్యాధులను రాకుండా నిరోధించగలమని అన్నారు. కాలువల్లో వాడిపడేసిన వ్యర్థాలను, ప్లాస్టిక్‌ను పడేయడం వల్ల కూడా మురికినీరు నిలిచి పోతోంది. దీనికి ప్రజలే బాధ్యత వహించాలి. అయితే కరోనా పరిస్థితి కారణంగా ఇప్పుడు ప్రజలకు గుణపాఠం వచ్చిందనే చెప్పాలి. అయితే ఇది ఎంతకాలం అన్నది కూడా చూడాలి. మురుగునీటి పారుదల సక్రమంగా లేకపోవడం వల్ల ప్రజలను తీవ్రంగా భయపెట్టింది. ఇకపోతే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నామని నాయకులు చెపుతున్నా వాస్తవం మరో రకంగా కనిపిస్తోంది. పారిశుద్ధ్య లేమి కారణంగానే ఇటువంటి వ్యాధులు ప్రబలుతున్న విషయం సుస్పష్టం. ఈ క్రమంలో ప్రజలు పురపాలకసంస్థపై ధ్వజమెత్తుతున్నారు. అపరిశుభ్రత కారణంగా దోమలు విజృంభించడం, వింతవ్యాధులు విజృంభించడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది. సీజనల్ వ్యాధుల నివారణ ప్రజల భాగస్వామ్యం తోనే సాధ్యమవుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. బహిరంగ ప్రదేశాలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీలు దోమల నివారణతో పాటుగా పారిశుద్ధ్య నిర్వహణ చేసేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో పారిశుద్ధ్య నిర్వహణ పైన దృష్టి సారించి, ప్రభుత్వ ప్రయత్నాలతో కలిసి రావాలి. ముఖ్యంగా దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు సొంత ఇళ్లలోని పారిశుద్ధ్యం అత్యంత కీలకమైన అంశం. ఇళ్ళలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాల్సి ఉంది. ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యవంతం చేసి, పారిశుద్ధ్య నిర్వహణలో వారిని భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వ అధికారులు, పురపాలక ప్రతినిధులు కృషి చేస్తూనే ఉన్నారు. ఇళ్లలో పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని పదేపదే కోరుతున్నారు.

# ప్రజా సమస్యలను గాలికొదిలేసిన మోడీ

గుంటూరు,నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రైవేట్ సంస్థలను కార్పొరేట్ రంగాలకు ధారాదత్తం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. గుంటూరులోని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్య మండలి రాష్ట్ర స్థాయి పాటలు, కళారూపాల శిక్షణ శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ప్రసంగించారు. కమ్యూనిస్టులను, కమ్యూనిస్టు భావజాలాన్ని అంతం చేయాలని చూస్తున్నారని చెప్పారు. బీజేపీ అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజా సమస్యలను ప్రజలను గాలికి వదిలేశారని ఆరోపించారు. విదేశాలలో ఉన్న 70 లక్షల కోట్లు ఎన్నికలలో గెలవగానే భారత్ కు తెప్పిస్తానని చెప్పి మాట తప్పారన్నారు. ప్రజా సమస్యలు తీర్చకుండా ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని రామకృష్ణ ఆరోపించారు. పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది టూరిస్టులు చనిపోవడం బాధాకరమన్నారు. ఆపరేషన్ సింధూర్ పేరుతో సరిహద్దు నాటకానికి తెరలేపారని సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు భయపడి మోడీ యుద్ధాన్ని ఆపేశారన్నారు. బీజేపీ ప్రభుత్వం ఒక నరహంతక పరిపాలన చేస్తుందని విమర్శించారు. విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి ప్రజా సమస్యలపై పోరాటానికి సన్నద్ధం అవుతామని స్పష్టం చేశారు. ఆపరేషన్ కగార్‌ని తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు.

# ప్రపంచ దౌత్యయాత్ర ... అంతరంగిక రాజకీయాలు



న్యూఢిల్లీ,“ డిప్లమాటిక్ అవుట్ రీచ్” పేరుతో ఒక దౌత్య ఉద్యమాన్ని భారతదేశం మొదలుపెట్టింది. ఏడు బృందాలు, ముప్పైరెండు దేశాలలో పర్యటించి, అక్కడి ప్రభుత్వ ప్రతినిధులను, రాజకీయనేతలను, ప్రభావశీలురను కలిసి పెహెల్‌గామ్ దగ్గర నుంచి ఆపరేషన్ సిందూర్ దాకా జరిగిన పరిణామాలను, పాకిస్థాన్ కొన్ని దశాబ్దాలుగా సరిహద్దు ఆవలి నుంచి భారత్ లో సృష్టిస్తున్న ఉగ్రవాద అశాంతిని వివరించి చెప్పనున్నాయి. ఈ అనధికార దౌత్యబృందాలలో దేశంలోని వివిధ రాజకీయపక్షాల ప్రతినిధులు, దౌత్య, విదేశాంగ వ్యవహారాల నిపుణులు, మాజీ రాయబారులు ఉన్నారు. భద్రతాసంఘంలో శాశ్వత సభ్యదేశాలను, తాత్కాలిక సభ్యదేశాలను, త్వరలో తాత్కాలిక సభ్యత్వం పొందే దేశాలను లక్ష్యంగా పెట్టుకుని ఈ యాత్రలు జరుగుతున్నాయి. పాకిస్తాన్ ప్రస్తుతం భద్రతాసంఘం తాత్కాలిక సభ్యదేశంగా ఉండి, అక్కడ తన ప్రభావాన్ని కొంత చూపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ బృందాల సభ్యులు పర్యటనలు ప్రారంభించి, ఆయా దేశాలలో వార్తాపత్రికలు, చానెళ్లకు భారత– పాక్ ఉద్రిక్తతల మీద ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. భారతవైఖరిని వివరిస్తున్నారు.ఈ దౌత్య ఉద్యమం మంచిది. ఎటువంటి దౌత్య ప్రయత్నమైనా సమస్య యుద్ధాల దాకా వెళ్లకుండా నివారిస్తుంది. ఇతర మార్గాల ద్వారా పరిష్కారానికి ఉపయోగపడుతుంది. అంతర్జాతీయ సమాజానికి విషయాన్ని వివరించడం న్యాయపక్షాన్ని బలపరుస్తుంది. అన్యాయపక్షాన్ని బలహీనం చేస్తుంది. పొరుగుదేశం పై భారతదేశం ఒక కఠినచర్య తీసుకోవలసి వచ్చినప్పుడు, దాని పూర్వాపరాల విషయంలో అనేకరకాల కథనాలు, వాదనలు ప్రపంచంలో వ్యాప్తిలో ఉన్నప్పుడు, తన వైఖరిని, వాదనను భారతదేశం వినిపించాలి. ఆ స్వరం భారతదేశంలో ఒక పక్షానిదో, ఒక వర్గానిదో కాకూడదు. ఆంతరింగికంగా రాజకీయ విభేదాలు ఎన్ని ఉన్నా, జాతీయ ప్రయోజనాల విషయంలో దేశమంతా ఒకటే అన్న సంకేతం ఉండాలి. అందుకే ఈ దౌత్యయాత్రా బృందాలలో అన్ని పార్టీలకు ప్రాతినిధ్యం ఇవ్వడానికి ప్రభుత్వం ప్రయత్నించింది. అంతే కాదు, ప్రతి బృందంలో కనీసం ఒక ముస్లిం ఉండాలన్న విధానాన్ని కూడా అనుసరించింది. రాజకీయంగా, సామాజికంగా అందరినీ కలుపుకుపోతామన్న సూచన ప్రపంచానికి ఇవ్వడం కూడా ఒక సానుకూల అంశం.ఇతర దేశాల నుంచి మద్దతును కూడగట్టుకోవడమే కాదు, పాకిస్థాన్ ప్రచారాలను ఓడించడం కూడా భారత్ కు అవసరం అవుతుంది. అనేక ప్రయోజనాల పరస్పరతల మీద దేశాల మధ్య సంబంధాలు ఆధారపడి ఉంటాయి. నేటి ప్రపంచవ్యవస్థలో దేశాల మధ్య సంబంధాలకు సుదీర్ఘమైన చరిత్ర ఉంది. వలసవాద కాలం నుంచి, ప్రచ్ఛన్నయుద్ధ కాలం వరకు ఏర్పడిన కూటములు, మైత్రులు, వైరసంబంధాలు, ఏకధ్రువ ప్రపంచమని అనుకుంటున్న కాలంలో కూడా కొనసాగాయి. భారత–పాక్ ఉద్రిక్తతలకు స్వాతంత్ర్యపూర్వ కాలం నుంచి, అమెరికా–సోవియెట్ శిబిరాల కాలం నుంచి వారసత్వ చరిత్ర ఉంది. అనేక పశ్చిమదేశాల వైఖరులు పాక్–భారత్ విషయాల్లో భారత్ కు వ్యతిరేకంగా కనిపించడానికి కారణం అదే.ప్రాంతీయశక్తిగా ఎదుగుతున్న ఇండియా మీద వాటికి కొన్ని అనుమానాలు, భయాలు కూడా ఉండవచ్చు. తన విధానాల మీద ఆ దేశాలకు ఉన్న ప్రతికూల అభిప్రాయాలను సవరించాలంటే, భారత్ తన వ్యవహారసరళి ద్వారా విశ్వాసం కల్గించడం ఒక్కటే చాలదు, సరిహద్దు ఉగ్రవాద బాధిత దేశంగా ఎదుర్కొంటున్న కష్టనష్టాలను కూడా పూసగుచ్చినట్టు చెప్పాలి. పెహెల్‌గామ్ అనంతరం భారత్–పాక్ మధ్య జరిగిన స్వల్పకాల సంఘర్షణ విషయమై ప్రపంచదేశాలకు నివేదించాలని భారత్ అనుకోవడం వెనుక ఆలోచన అదే.అయితే, యుద్ధాలకు, ఘర్షణలకు దారితీయగల ద్వైపాక్షిక ఉద్రిక్తతలకు. దేశాల ఆంతరంగిక సమాజంలో కూడా ప్రభావాలు, ప్రయోజనాలు, పర్యవసానాలు ఉంటాయి. ప్రజాస్వామ్యంలో దేశ ప్రభుత్వాల వైఖరుల మీద సమాజంలో అనుకూల, ప్రతికూల అభిప్రాయాలుంటాయి. జాతీయ విధానాల మీద విమర్శలు ఉన్నట్టే, విదేశాంగ విధానం మీద కూడా స్వదేశంలో అభ్యంతరాలుంటాయి. పొరుగుదేశంతోనో, శత్రుదేశంతోనో యుద్ధం వచ్చినప్పుడు, దేశమంతా ఒక్కతాటి మీద నిలబడాలన్నది ఎంతటి ఆమోదం కలిగిన విలువో, ఆ యుద్ధానికి దారితీసే ప్రభుత్వ విధాననిర్ణయాల మీద ఎప్పటికప్పుడు విమర్శలు చేయడంలో తప్పులేదనేది కూడా ప్రజాస్వామ్యంలో అంతే ఉన్నతమైన విలువే. ఆంతరంగికంగా తప్పులు చేసే రాజకీయపార్టీ లేదా దాని ఆధ్వర్యంలోని ప్రభుత్వం, బాహ్యవిషయాల్లో మాత్రం తప్పులు, ద్రోహాలు చేయదని ఏముంది? కొరియా మీద, వియత్నాం మీద, ఇరాక్ మీద, ఆఫ్ఘనిస్థాన్ మీద యుద్ధాలు చేసినప్పుడు, అమెరికన్ ప్రభుత్వ వైఖరికి అమెరికన్ సమాజం నుంచే విమర్శలు, వ్యతిరేకతలు వచ్చాయి.ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పాకిస్థాన్ వైఖరుల గురించి పాక్ ప్రముఖులే అనేకులు విమర్శనాత్మకంగా మాట్లాడినవి మనం చూశాము.మన దేశంలో కూడా ఆపరేషన్ సిందూర్ నేపథ్య, అనంతర పరిణామాల విషయంలో ప్రతిపక్షాలు భిన్న వైఖరులు చూపించాయి. పెహెల్‌గామ్ సంఘటన కు భద్రతావైఫల్యాల కారణాన్ని వేలెత్తి చూపించాయి. పాకిస్థాన్ మీద చర్య తీసుకోవడానికి మీనమేషాలు లెక్కించడమేమిటని నిలదీశాయి. ఆపరేషన్ సిందూర్ మొదలైనప్పుడు, దానికి పూర్తి మద్దతు ఇచ్చాయి, కానీ, కాల్పుల విరమణ సందర్భంలో అభ్యంతరాలు చెప్పాయి. అమెరికా అధ్యక్షుడి ప్రమేయాన్ని తప్పుపట్టాయి. ఈ కీలకమైన ఘట్టాలలో ప్రధానమంత్రి కశ్మీర్ సందర్శించకపోవడాన్ని,అఖిల పక్ష సమావేశాలలో పాల్గొనకపోవడాన్ని గట్టిగా ప్రశ్నించాయి. జాతీయ అధికారపార్టీ బిజెపి కూడా, తక్కువేమీ తినలేదు. ఒకవైపున, ప్రతిపక్షాలతో సంప్రదిస్తూనే ఉంది. మరోవైపు, తన సామాజికమాధ్యమ శ్రేణుల ద్వారా, దిగువశ్రేణి రాజకీయ నాయకుల ద్వారా, ప్రతిపక్ష నేతల దేశభక్తి రాహిత్యాన్ని, పాక్ అనుకూలతను ప్రచారం చేస్తూ వచ్చింది. అంటే, పొరుగుదేశంతో ఘర్షణ వాతావరణంలో కూడా దేశంలో రాజకీయ పోరాటం సాగుతూనే వచ్చింది.పెహెల్‌గామ్ అనంతర పరిణామాలను భారతీయ జనతాపార్టీ బిహార్ తదితర రాష్ట్రాల ఎన్నికలలో అనుకూలంగా ఉపయోగించుకుంటుందన్న భయాలు ప్రతిపక్షాలకు ఉన్నాయి. పెహెల్‌గామ్ తరహా హత్యాకాండ వల్ల దేశంలో కలిగిన భయాందోళనల విభజన వాతావరణం నుంచి, పాకిస్తాన్ మీద చర్య తీసుకోవడం ద్వారా సమకూరే ప్రతిష్ఠ నుంచి బిజెపి రాజకీయంగా ఎక్కువగా లాభపడకుండా చూడడానికి ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయి. అదే సమయంలో, టెర్రరిస్టుల స్థావరాల మీద గురిచూసి చేసిన దాడిని పదే పదే చెప్పుకోవడం ద్వారా, కలిగే సానుకూలతను పెంచుకోవాలని కేంద్రప్రభుత్వ పెద్దలు చూస్తున్నారు. కేంద్రప్రభుత్వ సారథులు, వారి పార్టీ మధ్య ఈ సందర్భంలో సరిహద్దురేఖ సహజంగానే అస్పష్టంగా మారిపోతుంది.మరి, నెలరోజులుగా దేశంలో జరుగుతూ వచ్చిన పరిణామాల మీద, ప్రభుత్వం తీసుకున్నచర్యలు–నిర్ణయాల మీద ప్రతిపక్షాలకు భిన్నమయిన అభిప్రాయాలు ఉన్నప్పుడు, దౌత్య ప్రచారయాత్రలో అందరూ కలసి ఎట్లా పాల్గొంటున్నారు? ఒకే వైఖరిని ఎట్లా చెబుతారు? అన్న సందేహాలు కలగడం సహజం. దౌత్య ప్రచారయాత్రలో జాతీయ ప్రయోజనాలతో పాటు, ప్రతిపక్షం తనతో గొంతుకలిపేట్టు చేసే రాజకీయప్రయోజనం కూడా కేంద్రప్రభుత్వం చూస్తోందా అన్న అనుమానాలూ కొందరికి ఉన్నాయి. అట్లాగే, ఈ దౌత్యప్రచార యాత్రకు ప్రతినిధులను ఎంపిక చేయడంలో కూడా రాజకీయ వివాదాలు

# కశ్మీర్ విద్యార్థులు నేరస్థులా?



జమ్మూ కాశ్మీర్: ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన మారణకాండను యావద్దేశం గర్హించింది. పర్యాటకులు ఏ మతం వారో పట్టిపట్టి ఆరా తీసి ఉగ్రవాదులు కాల్పులు జరపడం దేశం మొత్తం ముక్తకంఠంతో ఖండించింది. ఇప్పుడు అదే రీతిలో కశ్మీర్‌లోయ కాకుండా బయట ఉత్తరాది ప్రాంతాల్లో కశ్మీరీలపై దాడులు చేయడం ఆందోళన కలిగిస్తోంది. కశ్మీరీ అయితే చాలు వారి దాడులకు బలైనట్టే. ఈ దాడులకు పాల్పడుతున్న వారికి ఉగ్రవాదులకు తేడా ఏం లేదు. పహల్గాం ఉగ్రదాడితో ఎలాంటి సంబంధం లేకపోయినా, విద్యార్థులను, వ్యాపారులను నేరస్థులుగా ఇతర ప్రాంతాల్లో అనుమానించడం, దాడులు చేయడం తరచుగా జరుగుతున్నాయి. పహల్గాం సంఘటన జరిగిన ఆరురోజుల్లోనే ఈవిధంగా దేశం మొత్తం 17 సంఘటనలు జరిగాయి. ఎక్కువగా మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టడానికి జరుగుతున్న ప్రయత్నాల్లో ఒక వర్గానికి చెందిన మితవాద వర్గాల దురుసుతనమే ఈ సంఘటనల వెనుక కనిపిస్తోంది. పంజాబ్‌లో కశ్మీర్ విద్యార్థులను క్యాంపస్‌లోనే కర్రలతో, పదునైన ఆయుధాలతో దాడి చేశారు. ఉత్తరాఖండ్‌లో కాలేజీలనుంచి వెళ్లిపోవాలని బెదిరించారు.ఢిల్లీలో జామియా, మిలియా ఇస్లామియా విద్యార్థిపై దౌర్జన్యం చేశారు. హిమాచల్‌ప్రదేశ్, ముస్సోరీలో కశ్మీరీ శాలువాలు విక్రయించే వ్యాపారులపై దాడులు జరిగాయి. కశ్మీర్‌లో ఏదైనా హింస జరిగితే కశ్మీరీలంతా అనుమానితులవుతుండడం పరిపాటిగా సాగుతోంది. పహల్గాం ఉగ్రదాడి బాధాకరమైన వాస్తవాన్ని వెల్లడించింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో చదువుకుంటున్న కశ్మీర్ విద్యార్థులకు భద్రత గాలిలో దీపంలా తయారైంది. దేశంలో వీరికి భద్రత కల్పించే పటిష్టమైన, వ్యవస్థాపరమైన యంత్రాంగం లేదు. అలాగని వారి భద్రతను ప్రజల భావోద్వేగాలతో మారుతున్న అభిప్రాయాలకు విడిచిపెట్టకూడదు.పహల్గాం వంటి దాడులకు పాల్పడే ముష్కరుల లక్ష్యం కేవలం చంపడమే కాదు, సమాజాన్ని చీల్చడం, ప్రజల్లో నమ్మకాన్ని పోగొట్టడం, సామాజిక సామరస్యాన్ని విచ్ఛిన్నం చేయడం, సామాజిక వర్గాల్లో అనుమానాలను ప్రేరేపించడం. ఈ నేపథ్యంలో మనం స్పష్టంగా తెలుసుకోవలసింది కశ్మీరీ విద్యార్థులను హింసించడం దేశభక్తిలో భాగం కాదు.దేశాన్ని అంతర్గతంగా చీల్చాలనుకుంటున్న వారికి విద్యార్థులను దాసోహం చేయడమే అవుతుంది. ఈ హింసాకాండలు కొత్తేమీ కావు. కశ్మీర్ లోయలో ఏదైనా హింసాత్మక సంఘటన జరిగినా లేదా సైనికులు ముష్కరులకు బలైపోయినా, కశ్మీరీ విద్యార్థులకే తరచుగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. చాలా మంది విద్యార్థులు పేదరికంతోను, సంఘర్షణలతోను సతమతమవుతున్నా ఉన్నత చదువుల ద్వారా చక్కని భవిష్యత్ కోసం నిరీక్షిస్తున్నారు. వీరికి అన్ని విధాలా సహకారం అందడానికి బదులు కేవలం కశ్మీరీ అయినందున నేరస్థులుగా అనుమానించడం శోచనీయం. యూనివర్శిటీలు, ఇతర విద్యాసంస్థలు వీరిని పీడించే బందిఖానాలుగా మారుతుంటే పాలనా యంత్రాంగాలు పట్టించుకోవడం లేదు. కాలేజీ నిర్వాహకులు, చట్టాలు, పౌరసమాజం వారిని దేశసంక్షోభ సమయాల్లో బలిపశువులు కాకుండా చూడాలి. వారి ఫిర్యాదులను పరిష్కరించే అధికారులను నియమించాలి.వివక్షకు తావు లేని విధానాలు అమలు చేయాలి. స్థానిక పోలీస్‌ల సహకారంతో వారికి మూకుమ్మడి దాడులనుంచి రక్షణ కల్పించాలి. విధానాలకు అతీతంగా వారి మానసిక క్షోభను నివారించే ప్రయత్నం చేయాలి. క్లిష్ట పరిస్థితుల్లో ఈ విద్యార్థులు తీవ్ర ఆవేదనకు, మానసిక నైరాశ్యానికి గురవుతున్నారు. దేశం పట్ల వారు తమ విధేయతను నిరూపించుకునేలా అవకాశం కల్పించాలి. దేశంలోని మరే ఇతర విద్యార్థి వర్గాలకు ఇలాంటి దుస్సంఘటనలు ఎదురు కాకుండా చూడాలి. ఇలాంటి చర్యలు తీసుకోకుంటే విద్యార్థుల్లో భయం పెరిగి, తమ గుర్తింపు ఎవరికీ తెలియకుండా కాలేజీ క్యాంపస్‌ల్లో దాక్కొనే పరిస్థితి ఏర్పడుతుంది. తమ బాధలు ఎవరికీ చెప్పుకోలేక సుదీర్ఘకాల ఆందోళనలో మగ్గిపోవలసి వస్తుంది. పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన 26 మంది జ్ఞాపకాలను నిజంగా మనం మన్నించాలనుకుంటే మతపరమైన ప్రతీకార ఉచ్చులో మనం ఇరుక్కోకూడదు. సంస్థాగత సంకల్పానికి మనం స్పందించాలి. అంతర్గతంగా సాగుతున్న ఈ సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర విద్యామంత్రిత్వశాఖ రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో కార్యాచరణ రూపొందించాలి.క్లిష్టపరిస్థితుల్లో కశ్మీరీ విద్యార్థులకు ఎక్కడా, ఏ విద్యాసంస్థల్లోనూ వేధింపులు, బెదిరింపులు, దాడులు ఎదురు కాకుండా ఒక జాతీయ స్థాయి విద్యావిధానాన్ని అమలు చేయడం తప్పనిసరి. సామాజిక, సామరస్య వాతావరణాన్ని విచ్ఛిన్నం చేయడానికి ఒక హింసాత్మక సంఘటన చాలన్న ముష్కరుల జోస్యానికి అవకాశం ఇవ్వరాదు. హింసకు మన సమాధానం ఐక్యత తప్ప పగ, ప్రతీకారం కారాదు. మనబలం కరుణే తప్ప ప్రతిదాడి కారాదు. కశ్మీరీ విద్యార్థులు కోరుకునేది మన నుంచి అనుమానం కాదు, మనం అందించే సంఘీభావం. ఇప్పుడు మనకు కావలసింది కశ్మీరీ విద్యార్థులకు పటిష్టమైన భద్రతా చర్యలు కల్పించడం. అమాయకులైన యువత నేరారోపణకు బలికాకుండా వారిని రక్షించుకోవడానికి మనం కృతనిశ్చయులమై ఉండాలి. పహల్గాం దాడి సమయంలో వివిధ ప్రాంతాల పర్యాటకులను కులమతాలకు అతీతంగా ఆదరించి అక్కున చేర్చుకున్నది కశ్మీర్ ముస్లింలే అన్న వాస్తవాలను మరిచిపోరాదు. బాధితులకు ఆపన్నహస్తం అందించిన కశ్మీర్ లోయపైన, అక్కడి ప్రజలపైన, విద్యార్థులపైన ఎక్కడైనా వివక్ష చూపించడమంటే మనకు మనం శత్రువులం కావడమే.

# మృగాళ్లను బహిరంగంగా ఉరితీయాలి

అమరావతి,కఠిన చర్యలు తీసుకోక పోవడం, సకాలంలో శిక్షలు పడకపోవడం వంటి కారణాల వల్ల లైంగిక వేధింపులు, ప్రేమదాడులు, అత్యాచారాలు ఆగడం లేదు. మృగాళ్లు విజృంభిస్తూనే ఉన్నారు. అత్యాచార ఘటనలు సాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటున్నా రోజూ ఎక్కో ఒకచోట ఘటనలు తారసపడుతున్నాయి. అలాగే వరుస ఘటనలు ఎపిలో ఆందోళన కలిగిస్తున్నాయి. మృగాళ్ల కారణంగా ఆడపిల్లలకు భయం కలుగుతోంది. మరీ ముఖ్యంగా చిన్నారులను కూడా ఈ రాక్షసులు వదిలి పెట్టడం లేదు. ఆడపిల్లలను కన్న తల్లిదండ్రులు మరింత క్షోభకు గురవుతున్నారు. పటిష్ట చట్టం తీసుకుని రావడం నిజంగా అభినందనీయం అనుకున్న వారు కూడా ఇప్పుడు భయపడేలా పరిస్థితులు దాపురించాయి. దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలకు కఠిన శిక్షలు పడేలా చూడాలని సత్వర శిక్షలు అమలు చేయాలని యావత్ దేశం కోరుకుంటున్న వేళ కఠిన చట్టాన్ని తీసుకుని వచ్చి అమలు చేయాల్సిఉంది. కడప జిల్లాలో నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసి, హత్య చేయడం కలకలం రేపింది. దీనిని బట్టి మృగాళ్లలో కించిత్ భయం కూడా కనిపించడం లేదు. కిరాతకుడని ఎన్‌కౌంటర్ చేయడమని ప్రజలాంతా నిలదీసారు. మహిళలు, బాలికలపై అత్యాచారాలు వంటి అఘాయిత్యాలకు పాల్పడితే ఉరిశిక్ష విధించేలా చట్టాన్ని రూపొందించాలి. మహిళలపై అత్యాచారానికి పాల్పడితే అతి త్వరగా నిందితులకు మరణశిక్ష పడేలా చట్టం తీసుకొని రావాలి. ఇటువంటి కేసుల్లో నిందితులను దోషులుగా నిర్ధారించే ఆధారాలున్నప్పుడు మూడు వారాల్లోగా అంటే 21రోజుల్లో తీర్పు వచ్చేలా చట్టాలను కఠినం చేయాలి. కానీ ఇటీవలి ఘటనలు మృగాళ్లలో భయాన్ని కలిగించడం లేదని తెలిస్తోంది. ప్రేమించిన అమ్మాయి పెళ్లికి నిరకారించందనో లేక తనను ప్రేమించడం లేదనో లేకపోతే..ఒంటరి అమ్మాయిలను లేదా మహిళలను లక్ష్యంగా చేసుకుని రెచ్చిపోతున్నారు. రేప్‌లు చేయడం, హత్యలు చేయడం చాలా సులువైన పనిగా చూస్తున్నారు. ప్రతి జిల్లాలోను ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్ని ఏర్పాటు చేయాలి. అత్యాచారం, యాసిడ్ దాడులు, వేధింపులు, లైంగిక వేధింపులు వంటి హింసాత్మక ఘటనల్లో నేరాల విచారణకు ప్రతి జిల్లాల్లోను ప్రత్యే కోర్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. అంతేకాదు సోషల్ మీడియా వేదికగా బాధిత మహిళలకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారాలకు అడ్డుకట్టవేసేలా చట్టాన్ని రూపొందించారు. మహిళల గౌరవానికి భంగం కలిగించేలా పోస్టింగ్‌లు పెట్టేవారిపై ఉక్కుపాదం మోపాలి. నిజానికి ఆడవాళ్లపై అకృత్యాలు జరిగిన వెంటనే ఉపశమనం కలిగే చట్టం రావాలని తల్లిదండ్రులు, ప్రతి మహిళ, చెల్లి, ప్రతి ఇంట్లోని ఆడపిల్ల ఎదురు చూస్తోంది. అయితే చట్టాలు ఎన్ని ఉన్నా ప్రజల్లో మార్పులు మాత్రం రావడం లేదు. దుండగులను కఠినంగా అణచివేస్తే తప్ప మహిళలకు రక్షణ ఉండదని తేలిపోయింది. కఠినంగా అణచివేత చర్యలకు ఉపక్రమించాలన్ని సర్వత్రా విజ్ఞప్తులు వస్తున్నాయి. చిన్నారులపై అత్యాచారాలకు పాల్పడే వారిని బహిరంగ ఉరితీసే విధానం రావాలి.

# ఉగ్రకదలికలపై దృష్టిసారించిన ఎన్ఐఏ

హైదరాబాద్,ఉగ్రకదలికలపై తీవ్ర దృష్టిసారించిన జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ, హైదరాబాద్‌లో కీలకంగా మకాం వేసిన సిరాజ్ అనే వ్యక్తి చుట్టూ దర్యాప్తును ముమ్మరం చేసింది. గత ఏడు సంవత్సరాలుగా గ్రూప్స్ పరీక్షల శిక్షణ పేరుతో హైదరాబాద్‌లో తిష్ట వేసిన సిరాజ్, పక్కా వ్యూహంతో కార్యకలాపాలను సాగించినట్లు అధికారులు గుర్తించారు. సిరాజ్‌తో కలిసి ఉన్న సమీర్ అనే వ్యక్తి – హైదరాబాద్, విజయనగరం, ఢిల్లీ, బెంగళూరు, ముంబైలో రెక్కీ చేసినట్లు– తెలిసింది. గత సంవత్సరం నవంబరు 22న ముంబయి అంధేరిలో జరిగిన ఓ మత కార్యక్రమానికి సిరాజ్, సమీర్ హాజరైనట్లు– విచారణలో వెల్లడైంది. అందులో అధాన్ ఖురేషి, దిల్వాన్, మొహిసిన్ షేక్, జసీర్ అలియాస్ అమన్, ఫహాద్, అమిర్ అన్సారీ వంటి వ్యక్తులెందరికీ సంబంధించిన సంబంధాలు కూడా వెలుగుచూశాయి.ఒమన్, సౌదీ దేశాల నుంచి సిరాజ్, సమీర్లకు ఆర్థిక సాయం అందినట్లు గుర్తించిన అధికారులు, ఆ ఛానెళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. అలాగే యూపీకి చెందిన బాదర్ అనే వ్యక్తి, ఫర్హాన్ మోయినుద్దీన్ అనే వరంగల్ యువకునితో సిరాజ్ సంబంధాలు ఉన్నట్లు– తెలిసింది. బాదర్‌తో సిగ్నల్ యాప్ ద్వారా కాంటాక్ట్‌లో ఉండటం, ఫర్హాన్ కోసం ప్రత్యేకంగా నాలుగు బృందాల గాలింపు చర్యలు కొనసాగించడం ప్రస్తుతం దర్యాప్తులో కీలకాంశంగా మారింది. సిరాజ్ స్థాపించిన సంస్థలో సభ్యత్వం కలిగి ఉన్న ఇతరులను కూడా గుర్తించే ప్రయత్నంలో ఉన్న ఎన్ఐఏ, దేశీయంగా మరియు అంతర్జాతీయంగా ఉగ్రవాద అనుకూల స్వభావమున్న యువకులతో సంబంధాలను విపులంగా పరిశీలిస్తోంది. సిరాజ్, సమీర్ల ఎలాన్ ఏమిటన్నదానిపై క్లారిటీ– కోసం అధికారులు మరింత లోతుగా ఆరా తీస్తున్నారు. ఈ విచారణతో పాటు–, ఇతర అనుమానాస్పద చర్యలను పసిగట్టి ముందస్తు చర్యలు తీసుకునే దిశగా భద్రతా సంస్థలు సన్నద్ధమవుతున్నాయి.

# రాజకీయంలోనూ ఆడబిడ్డ వాటా

హైదరాబాద్,తల్లిదండ్రుల ఆస్తిలో ఆడబిడ్డకు వాటా.. భారతీయుల సంప్రదాయంలో భాగం. ఎంత పేదవారయినా తమ ఇంటి ఆడ పిల్లకు ఎంతో కొంత ఇస్తుంటారు.. ప్రస్తుత కాలంలో ఇది 'రాజకీయం'లోనూ అన్నట్లుగా మారింది. మరీ ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి దీనికి అద్దం పడుతోంది. ఇంకా చెప్పాలంటే ప్రాంతీయ పార్టీల్లో ఆడబిడ్డ వాటా గట్టిగా ప్రస్తావనకు వస్తోంది.తాజాగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విషయమే నిదర్శనం. పార్టీలో సమ స్థాయిని ఆమె కోరుకుంటున్నారని, ఇంకా ముందుకెళ్లి ప్రత్యామ్నాయంపై కూడా ఆలోచన చేస్తున్నారని అంటున్నారు. మద్యం కేసులో అరెస్టయిన కవిత గత ఏడాది ఈ సమయంలో ఢిల్లీ తిహాడ్ జైలులో ఉన్న సంగతి తెలిసిందే. తన రాజకీయ భవిష్యత్ ను దెబ్బకొట్టిన బీజేపీపై ఆమె మహా గుర్రుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తండ్రికి ఆరు పేజీల సుదర్ఘీ లేఖ రాయడం కలకలం రేపుతోంది. బీఆర్ఎస్ లో తాడోపేడో తేల్చుకునే ఉద్దేశంలో కూడా ఆమె ఉన్నట్లుగా చెబుతున్నారు. అసలు కవిత ఉద్దేశం ఏమిటో బయటపడాల్సి ఉంది. ఏదైనా సరే.. సోదరుడు కేటీఆర్, బావ హరీశ్ రావుతో సమానంగా ఆమె బీఆర్ఎస్ లో స్థాయిని కోరుకుంటున్నట్లు, పార్టీ విధానాలతో ఏకీభవిస్తున్నట్లు లేరని అర్థం అవుతోంది.మూడేళ్ల కిందట ఇదే సమయంలో దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె వైఎస్ షర్మిల కూడా రాజకీయంగా సొంత అడుగులు వేసిన సంగతి తెలిసిందే. అన్న వైస్ జగన్ అధికారంలో ఉండగా.. అప్పట్లో ఆమె సొంత రాష్ట్రం ఏపీని వదలి తెలంగాణలో పార్టీ పెట్టడం కలకలం రేపింది. ఆ తర్వాత తెలంగాణ ఎన్నికలకు దూరంగా ఉండడం, పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేయడం ఇతర విషయాలు. రాజకీయ ప్రాధాన్యం విషయంలోనో, ఆర్థిక వివాదాలతోనో షర్మిల తన అన్న జగన్ ను విభేదించి సొంత పార్టీ పెట్టుకున్నారు. ఏపీకి తిరిగివెళ్లి అన్న ఓటమికి పరోక్షంగా కారణమయ్యారు.మహారాష్ట్రలో తిరుగులేని నాయకుడైన శరద్ పవార్.. ఎన్సీపీ

# కవిత డిప్రెషన్ లో ఉన్నట్టు ఉంది..



హైదరాబాద్,బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాసిన లేఖపై తెలంగాణ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్రంగా స్పందించారు. కవిత లేఖ వల్ల కాంగ్రెస్‌కు ఎలాంటి నష్టం జరగదని, అది బీఆర్ఎస్ కుటుంబానికి సంబంధించిన వ్యక్తిగత అంశమని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్ ఉన్నప్పుడే కేటీఆర్, హరీష్ రావు, కవిత నాయకులని, కేసీఆర్‌ను దేవుడని అంటూనే దెయ్యాలని సంబోధించడం దేనికి సంకేతమని జగ్గారెడ్డి ప్రశ్నించారు. కవిత వ్యవహారం తన కొమ్మను తాను నరుకున్నట్టుగా ఉందని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు.మీడియాతో మాట్లాడుతూ జగ్గారెడ్డి, తెలంగాణ రాజకీయాల్లో ఏదో జరిగిపోతుందనే చర్చ జరుగుతోందని, కొత్త పార్టీల గురించి అన్ని రాజకీయ పక్షాల్లోనూ చర్చలు నడుస్తున్నాయని అన్నారు. కవిత లేఖతో కాంగ్రెస్‌కు ఎలాంటి నష్టం లేదని, కాంగ్రెస్ ఎప్పటినుంచో బలంగా ఉందని, భవిష్యత్తులోనూ బలంగానే ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీ బలహీన పార్టీ అని, బీఆర్ఎస్ ఉద్యమం పేరుతో బలమైన పార్టీగా అవతరించిందని, రాష్ట్ర విభజన కోణంలోనే బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిందని ఆయన విశ్లేషించారు. కాంగ్రెస్ పరిపాలనా దక్షతతో అధికారంలోకి వచ్చిందని, భవిష్యత్తులోనూ వస్తుందని ఆయన అన్నారు. మతం, హిందుత్వ పేరుతో బీజేపీ అధికారంలోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు.రాష్ట్రంలో బలమైన పార్టీలుగా కాంగ్రెస్ మొదటి స్థానంలో, బీఆర్ఎస్ రెండో స్థానంలో, బీజేపీ మూడో స్థానంలో ఉన్నాయని జగ్గారెడ్డి చెప్పారు. కమ్యూనిస్టు పార్టీలు ఉన్నప్పటికీ అధికారంలోకి వచ్చే పరిస్థితిలో లేవని ఆయన అన్నారు.

**కేసీఆర్‌తోనే ఉనికి..**

కవిత లేఖతో నష్టం జరుగుతుంది అనేది కేసీఆర్ కుటుంబ వ్యక్తిగత అంశమని జగ్గారెడ్డి అన్నారు. కవిత లేఖతో కేసీఆర్ కుటుంబంలో గొడవలు ఉన్నాయని ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు భావించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. కవిత లేఖ వల్ల బీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీ వైపు చూసే అవకాశం ఉందని ఆయన అన్నారు. కాంగ్రెస్‌లో బలమైన క్యాడర్ ఉండడంతో బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ కంటే బీజేపీ వైపు చూసే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. కేసీఆర్ కుటుంబంలో ఉన్నవారు తామే గొప్ప అనే భావన మంచిది కాదని, కేసీఆర్‌తోనే బీఆర్ఎస్ ఉనికి ఉంటుందని, కేసీఆర్ ఉంటేనే కేటీఆర్, హరీష్ రావు, కవిత నాయకులని ఆయన స్పష్టం చేశారు.

**బీజేపీకి ప్లస్ అవుతోంది..**

తండ్రి కూతురుగా కవిత నాయకురాలిగా ఎదిగారని, కేసీఆర్‌ను దేవుడని అంటూనే దెయ్యాలని సంబోధించడం దేనికి సంకేతమని జగ్గారెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ దేవుడని అంటూనే కేసీఆర్‌ను రాజకీయ సమాధి చేసేలా కవిత వ్యవహారం ఉందని ఆయన అన్నారు. కవిత వ్యవహారం తన కొమ్మను తాను నరుకున్నట్టుగా ఉందని, కవిత లీకుల వ్యవహారం బీజేపీని బలపరిచేలా ఉందని ఆయన విమర్శించారు. కవిత డిప్రెషన్‌లో ఉండి లేఖ విడుదల చేసినట్లుగా ఉందని, బీఆర్ఎస్ ఉనికిని దెబ్బతీస్తూ బీజేపీని పెంచి పోషించేలా బీఆర్ఎస్ వ్యవహారం ఉందని ఆయన అన్నారు. లేఖలు, లీకులు మీడియాలో వార్తలకు పనికి వస్తాయి కానీ, మీ మనుగడ దెబ్బతీస్తాయనే విషయం మర్చిపోతే ఎలా అని ఆయన ప్రశ్నించారు. బీజేపీకి లేని బలాన్ని బీఆర్ఎస్ ఇస్తుందని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ అలర్ట్ కావాలని ఆయన హెచ్చరించారు.

**కవితకు అవగాహన లేదు..**

బీఆర్ఎస్ కార్యకర్తలను కాంగ్రెస్ వైపు తిప్పుకునే వ్యూహం అమలు చేయాలని, దీనిపై పీసీసీ, సీఎంతో మాట్లాడుతానని జగ్గారెడ్డి అన్నారు. నాయకత్వం లేని బీజేపీకి బీఆర్ఎస్ ఎందుకు అవకాశం ఇస్తుందో అర్థం కావడం లేదని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కేసీఆర్ లోతైన ఆలోచన చేస్తారని, పిల్లలు దారి తప్పారని కేసీఆర్ భావిస్తున్నట్లు ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తండ్రి గురించి కవితకు పూర్తి అవగాహన లేకపోవడం దురదృష్టకరమని ఆయన అన్నారు. కుటుంబానికి వారసుడు కొడుకే అవుతాడని, కొడుకు లేని పక్షంలో కూతురు వారసురాలు అవుతుందని ఆయన పేర్కొన్నారు. కవిత ఏదో రాష్ట్ర రాజకీయాలను తిప్పేస్తుందని కాదని, చర్చల వల్ల నష్టం జరుగుతుందని ఆయన అన్నారు. కేసీఆర్ కూతురు కాబట్టే మీడియాలో కవితకు ప్రాధాన్యత అని, కవిత లేఖలు తమ శత్రువు బీజేపీకి ఉపయోగపడతాయనే తమ బాధ అని జగ్గారెడ్డి ముగించారు.

# గుబులు రేపుతోన్న కరోనా కొత్త వేరియంట్..!



న్యూఢిల్లీ, ఐదేళ్ల కిందట కరోనా సృష్టించిన విలయ తాండవం గుర్తుకొస్తే వళ్లు జలదరిస్తుంది. నాటి పరిస్థితులు తలుచుకుంటే వెన్నులో వణుకుపుడుతోంది.మహమ్మారి కరోనా ప్రపంచాన్ని కుదిపేసింది.లక్షలాది మంది ప్రాణాలు తీసింది.కోట్లాది మందిని ఆసుపత్రి పాల్జేసింది. ఏ హాస్పిటల్ చూసినా కరోనా పేషెంట్లతో నిండిపోయింది. బెడ్లు లేక, ఆక్సిజన్ అందాక ఎంతోమంది అల్లాడారు. కల్లోల కోవిడ్ ఎన్నో కుటుంబాలకు కన్నీళ్లు మిగిల్చింది. అలాంటి మాయదారి కరోనా వదల బొమ్మాళి అంటూ మళ్లీ కోరలు చాస్తోంది. సైలెంట్‌గా విస్తరిస్తూ బుసలు కొడుతోంది. నిను వీడని నీడనంటూ వెంటాడుతోంది. మూడేళ్ల విరామం తర్వాత దేశంలో జెట్ స్పీడ్‌తో వ్యాపిస్తూ టెన్షన్ పెడుతోంది. కేసుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. రోజుల వ్యవధిలోనే 250పైగా కేసులు రికార్డయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లోకి కొవిడ్ రీ ఎంట్రీ ఇచ్చింది. పాజిటివ్ కేసులతో పరేషాన్ చేస్తోంది.తెలంగాణలో కరోనా కలకలం రేపింది. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో కొవిడ్ కేసు నమోదైంది. ఓ డాక్టర్‌కు పాజిటివ్ నిర్ధరణ అయినట్లు వైద్యాధికారులు తెలిపారు. రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నఅతనికి ఆర్‌టిపిసిఆర్ పరీక్ష నిర్వహించగా.. ఫలితం పాజిటివ్‌గా వచ్చింది. ప్రస్తుతం ఆ వైద్యుడిని క్వారంటైన్‌లో ఉంచారు. ఆయన కుటుంబ సభ్యులకు కూడా కరోనా పరీక్షలు నిర్వహించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలంగాణ వైద్యాధికారులు భరోసా ఇస్తూనే.. అలెర్ట్‌గా ఉండాలని, బహిరంగ ప్రదేశాలలో తప్పనిసరిగా మాస్కులు ధరించాలని సూచించారు. కరోనా లక్షణాలు ఉన్నవారు వెంటనే పరీక్షలు చేయించుకొని స్వీయ జాగ్రత్తలు పాటించాలని కోరారు. హైదరాబాద్‌లో కొవిడ్ కేసుతో గాంధీ ఆసుపత్రి అప్రమత్తమైంది.ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండేలా, 35 పడకలతో కూడిన ప్రత్యేక కొవిడ్ వార్డును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నమోదవుతున్న శ్వాసకోశ సంబంధిత వ్యాధుల్లో సుమారు 60 శాతం వరకు ఈ వైరస్ వల్లే సంభవిస్తున్నట్లు వైద్య నిపుణులు అంచనా వేస్తున్నారు. దగ్గు, జలుబు వంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఎటువంటి భయం పెట్టుకోవద్దని, స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉన్నారని గాంధీ ఆసుపత్రి వైద్యులు భరోసా ఇచ్చారు. అయినా కూడా.. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, లక్షణాలు కనిపిస్తే తక్షణం వైద్యుడిని సంప్రదించడం అత్యవసరమన్నారు. ప్రస్తుతం ఉన్న వేరియంట్ చాలా మైల్డ్ లక్షణాలతో వస్తుందని..కంగారుపడాల్సిన అవసరం లేదంటున్నారు.అటు ఏపీలో కరోనా కేసులు వణికిస్తున్నాయి. ఇప్పటికే విశాఖలో కరోనా కేసు నమోదు కాగా తాజాగా కడపలో కరోనా పాజిటివ్ కేసు నమోదైంది. నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన 75 ఏళ్ల మహిళ అనారోగ్యంతో రెండు రోజుల క్రితం కడప రిమ్స్‌లో చేరింది.విశాఖ జిల్లా మద్దిలపాలెంకు చెందిన 23 ఏళ్ల యువతి కార్పొరేట్ ఆసుపత్రిలో 4 రోజుల కిందట జ్వరంతో చేరినప్పుడు.. అనుమానంతో కరోనా పరీక్ష చేయగా పాజిటివ్ అని పాజిటివ్ అని కన్‌ఫామ్ అయింది. ఇదే నమూనాను విశాఖ కేజీహెచ్‌లోని వైరాలజీ ల్యాబ్‌లోనూ పరీక్షించి కరోనా పాజిటివ్ అని నిర్ధారించారు.విశాఖ,కడపల్లో పాజిటివ్ కేసులతో వైద్య ఆరోగ్యశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. కరోనా నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ప్రార్థన సమావేశాలు, సామాజిక సమావేశాలు, పార్టీలు, ఇతర కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలని కోరింది. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, విమానాశ్రయాల్లో కొవిడ్ నిబంధనలు పాటించాలని,రద్దీ ప్రదేశాల్లో మాస్కులు తప్పనిసరిగా వాడాలని సూచనలు చేసింది. జ్వరం లేదా చలి, దగ్గు, అలసట, గొంతునొప్పి, రుచి లేదా వాసన కోల్పోవడం, తలనొప్పి, కండరాలు లేదా శరీర నొప్పులు, ముక్కు కావడం లేదా ముక్కుదిబ్బడ, వికారం, వాంతులు, విరోచనాలు ఉంటే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని ప్రభుత్వం సూచించంది. ఆరోగ్యశాఖకు చెందిన 24 గంటలు పని చేసే ల్యాబ్‌ల్లో మాస్కులు, పీపీఈ కిట్ ట్రిబుల్ లేయర్ మాస్కులను తగిన పరిణామంలో ఉంచుకోవాలని ఆదేశించింది. కొవిడ్ కేసులు పై రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్య కుమార్ సమీక్ష జరిపారు. కొవిడ్ కేసులు ఎదుర్కొనేందుకు అందర్నీ అప్రమత్తం చేస్తున్నామమని.. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు.విమ్స్, కేజీహెచ్‌లో 20 ఐసొలేషన్ బెడ్‌లు ఏర్పాటుచేశామన్నారు ఏపీ స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రాంబాబు. %ట్రాజు% కిట్స్, కొవిడ్ మందులను అందుబాటులో ఉంచామన్నారు. కరోనా విజృంభించకుండా అన్ని చర్యలు తీసుకున్నామని చెబుతున్నారు. విశాఖలో కోవిడ్ కేసు నమోదవడంతో కాకినాడ జీజీహెచ్ అధికారులు అప్రమత్తం అయ్యారు. 24 బెడ్లతో కరోనా వార్డు, ఓ ఐసోలేషన్‌ను ఏర్పాటు చేశారు. మాస్క్ తప్పనిసరి చేశారు . కరోనా వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.ప్రయాణాల్లోనూ, జనసమూహాల్లో ఉన్నప్పుడు తప్పనిసరిగా మాస్కులు వాడాలని సూచించారు.కొవిడ్ కేసుల ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చినవారు అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలని లేదాశానిటైజర్ ని వాడాలని సూచించారు.నాలుగేళ్ల కిందట ప్రపంచాన్ని కుదిపేసిన కొవిడ్ 19 ఆసియా దేశాల్ని షేక్ చేస్తోంది.డైలీ కేసుల సంఖ్య అంతకంతకూ పెరగడం దడ పుట్టిస్తోంది.ఆసియా దేశాలతో పోలిస్తే భారత్‌లో ఆందోళన పడాల్సిన పనే లేదు.కానీ ప్రస్తుతం మన దేశంలో 250కి పైగా యాక్టివ్ కేసులున్నాయి. కేరళ, తమిళనాడు, మహారాష్ట్రలో పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. గతంలోలాగే కొవిడ్ కేసుల్లో కేరళ తొలిస్థానంలో ఉంది. అందరూ అలెర్ట్ గా ఉండాలని, ఎటువంటి పరిస్థితికైనా సిద్ధమవ్వాలని కేరళ ఆరోగ్య మంత్రి వార్నింగ్ ఇచ్చారు. వైరస్ శరవేగంగా విస్తరిస్తుండటంతో పాండిచ్చేరి, ఢిల్లీ, గుజరాత్, రాజస్థాన్, సిక్కిం, హర్యానా, కర్ణాటక, పశ్చిమబెంగాల్ లు అలర్టయ్యాయి.

# కవిత ఇష్యూపై కేసీఆర్ లెక్కేంటి ?



హైదరాబాద్,భారత రాష్ట్ర సమితిలో వ్యవహారం ముదిరి పాకాన పడుతోంది. కేసీఆర్ తన బిడ్డల్లో ఒకరికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన పరిస్థితి వస్తే వారిని దూరం చేసుకున్నట్లే అవుతుంది. ఇప్పుడు ఇద్దరికీ సర్ది చెప్పాల్సిన పరిస్థితుల్లో ఆయన ఉన్నారు. ఒక వేళ కుమార్తె కంటే కుమారుడికే ప్రాధాన్యం ఇవ్వాల్సిన పరిస్థితి వస్తే కుమార్తె తన దారి తాను చూసుకునే పరిస్థితుల్లో ఉన్నారు. అలా జరిగితే పార్టీ చీలిపోతుంది. ఇది చాలా క్లిష్టమైన సమస్యే. అందుకే కేసీఆర్ ఈ ఇష్యూపై ఎలాంటి అభిప్రాయంతో ఉన్నారన్నది బయటకు రాలేదు.అయితే కేసీఆర్ ఈ అంశంపై చాలా సీరియస్ గాఉన్నారని..కవితకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తారని బీఆర్ఎస్ లోని ఓ వర్గం సోషల్ మీడియా ప్రచారం చేస్తోంది. అయితే కుమార్తె పట్ల కేసీఆర్ అంత కఠినంగా ఉంటారని ఎవరూ అనుకోవడం లేదు. షోకాజ్ నోటీసులు జారీ చేయడం.. పార్టీ నుంచి సస్పెండ్ చేయడం వంటివి జరగని విషయాలు అనుకోవచ్చు. కేటీఆర్ పై ఎంత ప్రేమ ఉంటుందో.. కవితపై కూడా కేసీఆర్ కు అంతే అభిమానం ఉంటుంది. ఇంకా చెప్పాలంటే ఇంటి ఆడపిల్ల విషయంలో అసలు కఠినంగా ఉండే అవకాశాలు లేవు. రాజకీయం కోసం ఆయన కుటుంబాన్ని ఇలాంటి పరిస్థితుల్లో చీల్చుకునే అవకాశాలు ఉండవు.అయితే ఇప్పుడు కుమార్తె, కుమారుడు మధ్య బ్యాలెన్స్ చేయడం అంత తేలిక కాదు. ఇరువురూ సమాన ప్రాధాన్యత కోరుతున్నారు. గతంలో కేటీఆర్ కు రాష్ట్ర బాధ్యతలు.. కవితకు జాతీయస్థాయిలో బాధ్యతలు ఇవ్వాలనుకున్నారు. కానీ జాతీయ పార్టీ ఫెయిలయింది. మరో రాష్ట్రంలో పోటీ చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు. అందుకే కవితకూ రాష్ట్రంలోనే ప్రాధాన్యత కల్పించాల్సి వచ్చింది. లిక్కర్ స్కామ్‌లో కవితను అరెస్టు చేసిన తర్వాత బీఆర్ఎస్ లో ఆమె ప్రాధాన్యాన్ని తగ్గించడానికే ప్రయత్నించారు. అక్కడ్నుంచే అసలు సమస్య ప్రారంభమయింది.కవిత విషయంలో ఎలాంటి అడుగులు వేసిన అది రివర్స్ అవడానికి అవకాశం ఉంటుంది. అందుకే కేసీఆర్ తన స్టైల్లో వీలైనంత వరకూ మౌనం పాటించి.. కాలానుగుణంగా నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి.

# "ఉగ్రవాద నాయకుడు" యూనస్.. బంగ్లాదేశ్‌ని అమెరికాకు అమ్మేస్తున్నాడు..



ఢాకా,బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధినేత షేక్ హసీనా, తాత్కాలిక పాలకుడు మహ్మద్ యూనస్‌పై విరుచుకుపడ్డారు. ఆయన బంగ్లాదేశ్‌ని అమెరికాకు అమ్మేస్తున్నారని తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు.డిసెంబర్ నెలలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలని సైన్యం పిలుపునిచ్చిన తర్వాత, తాను రాజీనామా చేస్తానని యూనస్ బెదిరించినట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.మహ్మద్ యూనస్ తీవ్రవాద గ్రూపుల మద్దతుతో పరిపాలన చేస్తున్నారని షేక్ హసీనా ఆరోపించారు. ఇటీవల తన పార్టీ అవామీ లీగ్‌పై నిషేధం విధించడాన్ని ఆమె ఖండించారు. దీనిని రాజ్యాంగ విరుద్ధమని అభివర్ణించారు. బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు, తన తండ్రి షేక్ ముజిబుర్ రెహమాన్ గుర్తు చేసుకుంటూ.. సెయింట్ మార్టిన్స్ ద్వీపాన్ని అమెరికాకు ఇవ్వడానికి నిరాకరించినందుకు ఆయన హత్యకు గురయ్యారని చెప్పారు. "అమెరికా సెయింట్ మార్టిన్స్ ద్వీపాన్ని కోరుకున్నప్పుడు, నా తండ్రి అంగీకరించలేదు. ఆయన తన ప్రాణాలను అర్పించాల్సి వచ్చింది. నాకు అలాంటి విధి వచ్చింది. ఎందుకంటే అధికారంలో ఉండటానికి దేశాన్ని అమ్మేయాలనే ఆలోచన నాకు ఎప్పుడూ రాలేదు" అని ఆమె ఫేస్‌బుక్ పోస్టులో చెప్పింది."ఈ దేశ ప్రజలు జాతిపిత బంగబంధు షేక్ ముజిబుర్ రెహమాన్ పిలుపునకు స్పందించి, ఆయుధాలు చేపట్టి పోరాడి, మూడు మిలియన్ల మందిని విడిపించడానికి తమ ప్రాణాలను అర్పించిన దేశం ఇది. ఆ దేశ నేలలో ఒక్క అంగుళం కూడా ఎవరికీ వదులుకోవాలనే ఉద్దేశ్యం ఎవరికీ ఉండదు. కానీ ఈ రోజు ఎంత దురదృష్టం. అలాంటి వ్యక్తి(యూనస్) అధికారంలోకి వచ్చాడు, మొత్తం దేశ ప్రజలచే పూర్తిగా ప్రేమించబడే వ్యక్తి, ప్రపంచం ప్రేమించబడే వ్యక్తి అయిన ముజిబుర్ రెహమాన్‌కి యూనస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏం జరిగింది.?" అని ఆమె ప్రశ్నించారు. తీవ్రవాద గ్రూపుల సహాయంతో యూనస్ ప్రభుత్వ నియంత్రణ చేజిక్కించుకున్నారని హసీనా ఆరోపించారు.యూనస్ ఉగ్రవాదుల సాయంతో, అంతర్జాతీయ నిషేధించిన వారితో కలిసి అధికారాన్ని చేజిక్కించుకున్నారని ఆమె దుయ్యబట్టారు. ప్రస్తుతం బంగ్లాదేశ్ ఉగ్రవాద రాజ్యాంగా ఉందని అన్నారు. ఈ తీవ్రవాద నాయకుడికి గొప్ప బెంగాలీ దేశం యొక్క రాజ్యాంగాన్ని తాకే హక్కు లేదని, అతడిని ప్రజలు ఎన్నుకోలేదు, కాబట్టి అతను చట్టాలను ఎలా మార్చగలడు..? అవామీ లీగ్‌ని ఎలా నిషేధించగలడు అని హసీనా ప్రశ్నించారు.

# ఏపీలో జగన్,షర్మిల..తెలంగాణలో కేటీఆర్, కవిత సీన్లు ఒక్కటే..!



హైదరాబాద్,తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలు రసవత్తరంగా మారాయని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. రెండు రాష్ట్రాల్లో ఒకేలా సీన్లు రిపీట్ అవుతున్నాయన్నారు.తండ్రులు సంపాదించిన ఆస్తుల పంపకాల్లో, రాజకీయ పదవుల్లో పంపకాల్లో తేడాలున్నాయని.. అన్నలు వదిలిన బాణాలు.. అన్నల మీదికే చెల్లెలు గురిపెడుతున్నారన్నారు. ఏపీలో జగన్ పై చెల్లి, షర్మిల బాణం ఎక్కు పెడితే, తెలంగాణలో కేటీఆర్ పై కవిత గురి పెట్టిందని విమర్శించారు. తమ అస్తిత్వాన్ని కాపాడుకోవడాని, ప్రజల అవసరాల కంటే, కుటుంబ అవసరాలే కీలకం అన్నట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. మొన్న వైఎస్సార్ కుటుంబం.. ఇపుడు కేసీఆర్ కుటుంబం.. అన్నల పైకి చెల్లెలను ఉసి గోల్పడంలో కాంగ్రెస్ కీలకంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ కు వ్యతిరేకత మొదలైందని.. రేవంత్ బీద అరుపులు అరుస్తున్నారని విమర్శించారు. ప్రజలలో ఉన్న వ్యతిరేకతను.. మళ్లించేందుకు ఈ ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు.టీఆర్ఎస్ పుట్టి మునిగిపోయిందని.. దేశంలో బీజేపీ వెలిగిపోతోందని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. "తెలంగాణలో బీజేపీ బలపడింది.. భవిష్యత్ లో అధికారంలోకి కూడా రానుంది. కవిత లేఖ రాసింది వాస్తవమే.. కవిత కేసీఆర్ ను కలిసే పరిస్థితి లేదా? కేసీఆర్ ప్రతిపాదిస్తున్న కేటీఆర్ ను సవాలు చేస్తున్నట్టుగానే కవిత సవాలు అర్థం అవుతోంది. కేటీఆర్ నాయకత్వాన్ని అంగీకరించను అని చెప్పకనే చెపుతోంది. అన్న ఆధిపత్యాన్ని సవాలు చేయడమే లేఖాస్త్రం. కవిత సామాజిక తెలంగాణ గురించి మాట్లాడటం.. దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగానే ఉంది. భారత దేశం ఆర్థికంగా అత్యంత బలోపేతంగా నిలుస్తోంది. భారత దేశం 4 వ ఆర్థిక అతిపెద్ద దేశంగా గుర్తింపు పొందింది. భారత్ జపాన్‌ను అధిగమించింది. మోడీ నాయకత్వానికి తార్కాణం. వికసిత భారత్ కూడా కచ్చితంగా సిద్ధిస్తుంది." అని వ్యాఖ్యానించారు.

# బాబు ఆత్మని విజయసాయి కలిశారా ?



అమరావతి,వైసీపీకి అతి పెద్ద పునాది లాంటి మాజీ ఎంపీ వి విజయసాయిరెడ్డి మీద వైసీపీ రగిలిపోతోంది. ఏకంగా అధినేత జగన్ అయితే ఆయన చంద్రబాబుకు అమ్ముడుపోయారు అని ఘాటు వ్యాఖ్యలే చేశారు. తన మూడున్నర ఏళ్ళ రాజ్యసభ పదవిని తాకట్టు పెట్టారని కూడా హార్ష్ గానే కామెంట్స్ చేశారు.విజయసాయిరెడ్డి టీడీపీ పెద్దల ప్రలోభాలకు లొంగిపోయారు అని కూడా జగన్ అన్నారు. జగన్ ఈ విమర్శలు చేసినపుడు రాజకీయ విశ్లేషకులతో సహా చాలా మంది ఎందుకు ఆయన అనవసరంగా విజయసాయిరెడ్డి మీద ఈ తరహా కామెంట్స్ చేస్తున్నారు అని అనుకున్నారు.బాబుకు ఎంపీ పదవి తాకట్టు పెట్టారు ఏకంగా ఆయనే అమ్ముడుపోయారు అన్నపుడు అంత పెద్ద మాటలు ఎందుకు అని కూడా అనుకున్నారు. అయితే జగన్ పక్కా ఆధారాలతోనే ఈ తరహా కామెంట్స్ చేశారు అని అంటున్నారు. దానికి సంబంధించి ది వైర్ అన్న దాంట్లో ఒక సంచలన కథనం వచ్చింది. విజయసాయిరెడ్డి ఈ మధ్య లిక్కర్ స్కాం విషయంలో సిట్ విచారణకు హాజరయ్యారు దాని కంటే ముందు ఆయన చంద్రబాబుకు ఆత్మలా వ్యవహరించే టీడీ జనార్ధన్ అనే నేతను కలిశారు అన్నది ది వైర్ బయటపెట్టింది అంటున్నారు.ది వైర్ ఈ విషయం మీద రాసిన కథనం ఇపుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. దీనికి సంబంధించి సీసీ ఫుటేజ్ సహా ది వైర్ బయటపెట్టడం విశేషం. మరుసటి రోజు సిట్ విచారణకు విజయసాయిరెడ్డి హాజరు కావాల్సి ఉండగా ఆయన ముందు రోజు సాయంత్రం టీడీపీ సీనియర్ నేత టీడీ జనార్ధన్ ని కలిసారు అన్నది ది వైర్ కథనంగా ఉంది.తాడేపల్లిలోని విల్లా నంబర్ 27కి విజయసాయిరెడ్డి కారు వెళ్ళిందంటూ ది వైర్ సీసీ ఫుటేజ్ సాక్షిగా చెబుతున్నట్లుగా సోషల్ మీడియా కథనాలు ఇపుడు వైరల్ అవుతున్నాయి. ఇంతకీ ఈ విల్లా ఎవరిది అంటే ప్రముఖ నటుడు క్రిష్ణ సోదరుడు సినీ నిర్మాత ఘట్టమనేని ఆదిశేషగిరిరావుది అని అంటున్నారు. ఇక ఆ విల్లాలోకి వెళ్తూ టీడీ జనార్ధన్ కూడా కనిపించారని ది వైర్ కథనం చెబుతోంది.ఈ విల్లాలో విజయసాయిరెడ్డి, టీడీ జనార్ధన్ ఇద్దరూ ఒక నలభై అయిదు నిముషాల పాటు భేటీ అయి చర్చించుకున్నారు అన్నది ది వైర్ కథనంగా ఉంది. సీఐడీ విచారణకు కొద్ది గంటల ముందు ఈ సీక్రెట్ మీటింగ్ జరిగింది అని అంటున్నారు.ఆ తరువాత విజయసాయిరెడ్డి వైసీపీ మీద జగన్ మీద ఆరోపణలు తీవ్ర స్థాయిలో మీడియా ముందు చేశారు అని అంటున్నారు. ది వైర్ ఈ వార్తా కథనాన్ని ప్రముఖంగా ప్రచురించడమే కాకుండా అనూహ్యమైన ఈ భేటీకు అర్థాలు ఏమిటి అన్న ఆసక్తిని కూడా రేపింది అని అంటున్నారు. మొత్తానికి చూస్తే తాజాగా జగన్ ప్రెస్ మీట్ లో విజయసాయిరెడ్డి మీద చేసిన ఆరోపణలలో పదును చాలానే ఉంది అని అంటున్నారు మరి విజయసాయిరెడ్డి టీడీపీతో కలసిపోయారా అన్నది ఈ కథనం చూస్తే అందరికీ డౌట్లు అయితే వస్తున్నాయి. మరి దీని మీద విజయసాయిరెడ్డి పెదవి విప్పితే కానీ ఈ విషయంలో క్లారిటీ ఉండదు అని అంటున్నారు.

# అడ్వాన్సడ్" బ్రహ్మోస్ మిస్సైల్" తయారీ కోసం భారత్, రష్యా చర్చలు..




న్యూఢిల్లీ, ఆపరేషన్ సిందూర్‌లో భారత్ ఉపయోగించిన "బ్రహ్మోస్ మిస్సైల్స్" శక్తిని ప్రపంచమంతా చూసింది. ముఖ్యంగా, పాకిస్తాన్ కి చెందిన 11 ఎయిర్ బేస్‌లపై దాడుల్లో బ్రహ్మోస్ పనితనం బయటపడింది.అయితే, ఇప్పుడు అడ్వాన్సుడ్ బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ కోసం భారత్, రష్యాలు చర్చలు జరుపుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు రష్యా పూర్తి సాంకేతిక సహాయాన్ని అందించిందని పలు నివేదికలు పేర్కొన్నాయి. లక్నోలో కొత్తగా ప్రారంభించబడిన బ్రహ్మోస్ తయారీ ఫెసిలిటీలోనే అధునాతన బ్రహ్మోస్ క్షిపణులను తయారు చేసే లక్ష్యంతో ఇప్పటికే చర్చలు జరిగాయని తెలుస్తోంది.రూ. 300 కోట్ల వ్యయంతో లక్నోలో నిర్మించిన ఈ ఫెసిలిటీలో, కొత్త బ్రహ్మోస్ క్షిపణులు తయారు కాబోతున్నాయి. ప్రస్తుతం బ్రహ్మోస్ వెర్షన్ 290-400 కి.మీ పరిధిని, మాక్ 2.8 గరిష్ట వేగాన్ని కలిగి ఉంది. బ్రహ్మోస్ భారత్-రష్యాల జాయింట్ వెంచర్. దీనికి బ్రహ్మపుత్ర, మాస్కోవా నదుల పేర్లపై బ్రహ్మోస్‌గా పిలుస్తారు. దీనిని భూమి, సముద్రం, గాలి నుంచి కూడా ప్రయోగించవచ్చు. "ఫైర్ అండ్ ఫర్గాట్" వ్యవస్థను ఇది కలిగి ఉంది.

Printed, Published & Owned by MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From SPOORTHI PUBLICATIONS, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: MEDE SHANTHI KUMAR.